### జమ్ము కశ్మీర్‌లో ఎదురు కాల్పులు..

జమ్ము కశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో గతంలో ఉగ్రవాదులు (ఉగ్రవాదులు), భద్రతా బలగాల (భద్రతా దళాలు) మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా శనివారం కూడా జమ్ము కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ (భారీ కాల్పులు) మొదలైంది.శ్రీనగర్ లోని ఖన్యార్ ప్రాంతంలో తుపాకుల మోత మోగుతోంది. ఇక్కడ జోన్ ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు కశ్మీర్ పోలీసులు తెలిపారు. శుక్రవారం యూపీకి చెందిన ఇద్దరు వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు, పోలీసులు సంయుక్తంగా ఆ ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ భద్రతా బలగాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భారత దళాలు.. వారిపై ఎదురు కాల్పులకు దిగారు. ప్రస్తుతం అక్కడ ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువైపులా ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు నివేదికలు లేవు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :218 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 03-11-2024 పేజీలు:4 వెల: 2.00


## ప్రధాని మోదీకి సీఎం రేవంత్ మాస్ కౌంటర్!



హైదరాబాద్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక హామిలున్ ఇచ్చిందని.. కానీ అవి అమలు చేయడంలో విఫలమైందని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు ట్విట్టర్ వేదికగా కౌంటర్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. ఆయన ట్విట్టర్ లో.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 7, 2023లో అధికారంలోకి వచ్చిందని అన్నారు. సీఎం తాను బాధ్యతలు తీసుకున్న రెండో రోజే ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు హామీలను అమలు చేశామని అన్నారు. అందులో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.. రెండోది ఉచిత వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచమని అన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని అన్నారు. త్వరలోనే మిగతా హామీలను కూడా అమలు చేస్తామన్నారు.

ప్రియమైన నరేంద్రమోదీ జీ అంటూ....

ప్రియమైన నరేంద్రమోదీ అంటూ సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు తమ ప్రభుత్వం మీకు ఉన్న అపోహలను తొలిగిస్తానన్నారు. డిసెంబర్ 7, 2023 నుండి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది అన్నారు. బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లోనే, తెలంగాణ ప్రభుత్వం తన మొదటి, రెండవ ఎన్నికల వాగ్దానాన్ని – అన్ని TGSRTC బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల ఆరోగ్య సంరక్షణ & ఆసుపత్రి కవరేజీని విడుదల చేసిందని అన్నారు. గత 11 నెలల్లో తెలంగాణలోని మన సోదరీమణులు, తల్లులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ప్రయాణించారు, రాష్ట్రవ్యాప్తంగా 101 కోట్లకు పైగా ఉచిత బస్సు యాత్రలను చేపట్టి, ఒక సంవత్సరం లోపు రూ. 3,433.36 కోట్లు ఆదా చేశారు. తమ మొదటి సంవత్సరం పూర్తి కాకముందే, మేము రైతే రాజు (తెలంగాణలో రైతు రాజు)కి భరోసా ఇస్తూ భారతదేశంలోనే అతిపెద్ద రాష్ట్ర స్థాయి రైతు రుణమాఫీని అమలు చేసినట్లు చెప్పారు. 22 లక్షల 22 వేల మంది రైతులు (22,22,365) ఇప్పుడు ఎలాంటి రుణం లేకుండా, రాజులా జీవిస్తున్నారని.. రూ. 2,00,000 వరకు రైట్ల రుణాలన్నీ మాఫీ చేయబడ్డాయని అన్నారు. 25 రోజుల్లో 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 0మ ఇళ్లకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఛార్జీ లేకుండా ఉచిత విద్యుత్ అందుతున్నందున మహిళలు మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉంటే, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో కేవలం 500 రూపాయలకే సిలిండర్ లభిస్తుండడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తమ హయాంలో ఇప్పటివరకు 1.31 కోట్లకు పైగా గ్యాస్ సిలిండర్ రీఫిల్‌లు జరిగాయని చెప్పారు. 42,90,246 మంది లబ్ధిదారులు ప్రతిరోజూ వంటగదికి నవ్వుతున్నారని అన్నారు.

## బూటుకాళ్ల శబ్దాలతో తెలంగాణ తెల్లవారే రోజులొచ్చాయి

హైదరాబాద్: పంటల దిగుబడిలోనే కాదు, పశు సంపదలోనూ గత పదేళు పండుగ వాతావరణం ఉందని అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. కులవృత్తులకూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కొండంత అండగా ఉండడంతోనే పశుసంపదలో గణనీయ వృద్ధి కనిపించిందన్నారు. శనివారం కెటిఆర్ తన ట్విట్టర్ లో ట్వీట్ చేశారు. గ్రామీణ తెలంగాణలో ఉపాధి పెంచాలనే తపన ఉండేదని, సంపద సృష్టిలో అందరినీ భాగస్వామ్యం చేయాలనే తాపత్రయం ఉండేదన్నారు. తెలంగాణలో డిమాండ్ తగ్గట్టుగా మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు పెంచే ప్రయత్నం చేశామని, ఇతర రాష్ట్రాలనుంచి ప్రతి రోజు వచ్చే వందలాది లారీల దిగుబడికి పదేళ్లలో కళ్లెం పడిందని కెటిఆర్ ప్రశంసించారు.ప్రతి ఆలోచన వెనక ఒక సుదీర్ఘ అధ్యయనం ఉందని, మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ లక్ష్యం ఆరోగ్య తెలంగాణ నిర్మాణం అని తెలియజేశారు. పదేళ్లలో వేల కోట్ల వృద్ధి జరిగిందని కేంద్రం ప్రకటించడం సంతోషంగా ఉందని, ఈ అద్భుత స్కీములను స్కాములు అని దుష్ప్రచారం చేసిన దుర్మార్గులు ఇకనైనా తీరు మార్చుకోవాలని సూచించారు. కళ్లముందు ఆవిష్కృతమైన ఈ అద్భుతాలను చూసి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. కానీ నేడు గొర్ల పంపిణీ లేక, చేప పిల్లల పంపిణి నిలిపేసి కుల వృత్తులను రూపుమాపే కుట్రలు చేస్తున్న పాలకులారా కేంద్ర లెక్కలు చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని కెటిఆర్ తెలిపారు.పోరాడి సాధించుకున్న పదేళ్లు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్న తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులొచ్చాయని కెటిఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామిక తెలంగాణ లో.. మళ్లీ ఎనుకటికాలంలా బూటుకాళ్ల శబ్దాలతో తెలంగాణ తెల్లవారే రోజులొచ్చాయని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నిస్తే కేసులు పెడుతు న్నారని, హక్కులను అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. పోరాడితే సస్పెన్షన్లు, ఇది నియంతృత్వ రాజ్యమా?, నిర్బంధాన్ని నిర్మిస్తున్న ప్రభుత్వమా? అని అడిగారు. పోరాటం తెలంగాణకు కొత్తకాదు అని, ఈ మట్టి పొత్తిళ్లలో పోరాటం ఉందని, ఆ సహజత్వాన్ని ఎత్తిపడుతూ నిర్బంధాన్ని ఎదురిస్తామని, ప్రజాస్వామిక తెలంగాణ పునరుద్దరణకై పోరాడుతామని కెటిఆర్ పిలుపునిచ్చారు.

కేంద్రం లెక్కలు చూసైనా బుద్ధి తెచ్చుకోండి..



హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అద్భుతమైన స్కీములను స్కాములని దుష్ప్రచారం చేసిన దుర్మార్గులు ఇకనైనా తీరు మార్చుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కేటీఆర్) హితవు పలికారు. గత పదేండ్లలో తెలంగాణలో వేల కోట్ల అభివృద్ధి కేంద్రం ప్రకటించిన లెక్కలను చూసినా బుద్ధి తెచ్చుకోవాలంటూ చురకలంటించారు. కళ్లముందు ఆవిష్కృతమైన ఈ అద్భుతాలను చూసి ఇప్పటికైనా మారాలని సూచించారు. పంటల దిగుబడిలోనే కాదు, పశు సంపదలోనూ గత పదేండ్లు పండగనని చెప్పారు. కులవృత్తులకూ కేసీఆర్ కొండంత అండగా నిలవడం వల్లే పశు సంపదలోనూ గణనీయ వృద్ధి సాధించారు. గ్రామీణ తెలంగాణలో ఉపాధి పెంచాలనే తపన, సంపద సృష్టిలో అందరినీ భాగస్వామ్యం చేయాలనే తాపత్రయం తమదని.తెలంగాణలో ఉన్న డిమాండ్ తగ్గట్టుగా ఇక్కడే మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు పెంచే ప్రయత్నం చేశామన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి ప్రతినిత్యం వచ్చే వందలాది లారీల దిగుబడికి గత పదేండ్లలో కళ్లెంవేశానని చెప్పారు. ప్రతి ఆలోచన వెనక ఒక సుదీర్ఘ అధ్యయనం ఉందని, కేసీఆర్ ఆరోగ్య లక్ష్యం తెలంగాణ నిర్మాణమని స్పష్టం చేశారు. నేడు గొర్లు, చేప పిల్లల పంపిణీని నిలిపేసి కులవృత్తులను రూపుమాపే కుట్రలు చేస్తున్న పాలకులారా కేంద్ర లెక్కలు చూసైనా బుద్ధి తెచ్చుకోవాలంటూ ఎక్స్' వేదికగా సూచించారు.

## కులగణనకు భారీగా కసరత్తు

హైదరాబాద్,నవంబర్2: నవంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బిసి కులగణన సర్వే ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే 85 వేల మంది ఎన్యూమరేటర్లు ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు సైతం ఈ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయులను కూడా ఈ సర్వేకు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల వేళలు అయిపోయిన తరువాత ఒక్కో ఉపాధ్యాయుడు ప్రతిరోజు 5 నుంచి 7 ఇళ్లను సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్యుమరేటర్‌లకు, సూపర్‌వైజర్‌లకు, ఇతర సిబ్బందికి ఆకర్షణీయమైన వేతనాన్ని చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సర్వే జరిగే ప్రతి గ్రామంలో ముందుగా దప్పు చాటింపు వేయించాలని, సర్వే నిర్వహించే సమయంలో కలెక్టర్‌లు క్షేత్రస్థాయిలో తిరిగి తనిఖీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రేటర్ హైదరాబద్ పరిధిలో 21 వేల మంది ఎన్యుమరేటర్‌లను ప్రభుత్వం వినియోగించుకుంటుంది.రాష్ట్రంలో కులగణనను చాలా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కూడా స్పష్టం చేశారు. ఈ కులగణన సందర్భంగా తప్పుడు సమాచారం ఇచ్చినా.. తప్పుడు సమాచారం నమోదు చేసినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కులగణన సర్వే సందర్భంగా కులం పేరు తప్పుగా నమోదు చేయించుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. కులగణన బృహత్తర కార్యక్రమమని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాటి కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే



ఎక్కడ ఉందో తెలియదని అన్నారు. ఆ వివరాలు ఏమయ్యాయో ఆ దేవుడికే తెలుసునన్నారు. అయితే ఆనాటి వివరాలు తెలియవని అంటే సరిపోదు. అవి ఏమయ్యాయో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. సర్వేలో కేవలం బిసి జనాభా గురించి కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్దిని దృష్టిలో పెట్టుకుని అన్ని వివరాలు సేకరిస్తే మంచిది. ఈ గణన ద్వారా బీసీలతో పాటు అన్ని కులాల జనాభా లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయి. సర్వే సక్రమంగా జరిగేలా చూడాలి. 80వేల నుంచి 90వేల మంది ఎన్యుమరేటర్లు జనగణనలో పాల్గొంటారు. ఎవరూ దీన్ని రాజకీయం చేయొద్దు. అపోహలు, ఆటంకాలు సృష్టించడం మంచిది కాదని నిరంజన్ అన్నారు. సర్వేకు వచ్చే సిబ్బందికి సమగ్రమైన వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కులగణన అనేది ఎక్స్ రే మాత్రమే కాదని.. హెల్త్ చెకప్ లాంటిందని కూడా సీఎం రేవంత్ అభివర్ణించారు. అందువల్ల అసమగ్రతకు తావు లేకుండా సాగాల్సి ఉంటుంది.

## కులం గురించి ఆసక్తికర విషయాలు చెప్పిన ఎంపీ శశిథరూర్



ముంబై: లోక్‌సభ ఎంపీ శశిథూర్.. కులం గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలిపారు. చాంపియన్ స్కూల్‌లో చదువుతున్న సమయంలో.. తన కులం గురించి తనకు తెలియదన్నారు. స్కూల్‌మేట్ ఒకరు తన కులం ఏంటని ప్రశ్నించాడని, అప్పుడు తాను ఇంటికి వెళ్లి తన తండ్రిని కులం గురించి అడిగానని చెప్పారు. ఆ సమయంలో తమ కులం ఏంటో తండ్రి చెప్పినట్లు శశిథరూర్ గుర్తు చేశారు. మనోరమ పత్రిక నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తమది కేరళకు చెందిన నాయర్ల కుటుంబం అని, కానీ తన తండ్రి నాయర్‌ను తన పేరు నుంచి తీసివేసినట్లు వెల్లడించారు. కులం గురించి తెలుసుకోవాల్సిన అవసరం లేదని తమ పేరెంట్స్ చెప్పినట్లు శశిథరూర్ తెలిపారు. కులం ఆధారంగా తమ పేరెంట్స్ ఎవరినీ ట్రీట్ చేయలేదన్నారు.కులం గురించి తెలియని ఎంపీ శశిథరూర్ మాత్రం కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు. కులం వల్ల ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఉన్నత కులస్థులను అడిగితే, వాళ్లు లేవని చెబుతారని, అదే ప్రశ్నను ఓ తక్కువ కులం వ్యక్తిని అడిగితే, ప్రతి రోజూ కులం సమస్యలను ఎదుర్కొన్నట్లు వాళ్లు చెబుతారని ఎంపీ శశిథరూర్ తెలిపారు. మన దేశంలో రాజకీయ పార్టీలు కులం ఆధారంగానే టికెట్లు ఇస్తున్నాయని, లబ్ధిదారుల్ని కూడా కులం ఆధారంగా ఎన్నుకుంటున్నారని తెలిపారు. కులం ఆధారంగానే ప్రభుత్వం కూడా రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ఎంపీ శశి వెల్లడించారు. కులం అంశాన్ని విస్మరించలేమన్నారు.ఒకప్పుడు తమ పార్టీలో చేరాలని బీజేపీ తనను అప్రోచ్ అయినట్లు శశిథరూర్ వెల్లడించారు. వాజ్‌పేయి ప్రభుత్వ సమయంలో ఓ మంత్రి తన న్యూయార్క్ ఆఫీసుకు వచ్చి ఆ ఆఫర్ ఇచ్చినట్లు చెప్పారు. దేశాన్ని బీజేపీ చూస్తున్న కోణం వేరని, తాను చూస్తున్న కోణం వేరు అని ఆయన అన్నారు. ఒకవేళ తాను బీజేపీలో చేరితే, అప్పుడు తన పుస్తకాలను తగలబెట్టాల్సి ఉంటుందని ఓ రీడర్ అభిప్రాయపడినట్లు శశిథరూర్ తెలిపారు. నేతలు పార్టీలు మారడం గురించి మాట్లాడుతూ రాజకీయాలంటే హోదా కాదు అని, విలువలు పాటించాలన్నారు.

### శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

హైదరాబాద్,నవంబర్2: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. శనివారం నుంచి కార్తీక ప్రవేశంతో శైవాలయాలు కిటకిటలాడాయి. అలాగే నదీతీరాలు, సముద్ర తీరాల్లో పవిత్ర స్నానాలకు ప్రజలు చేరుకున్నారు. నదీతీర శైవ క్షేత్రాలు కార్తికమాసం శోభను సంతరించుకున్నాయి. కార్తికమాసం తొలిరోజు కావడంతో శనివారం తెల్లవారుజాము నుంచి మహిళలు, భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మహాశివునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ముక్కంటి సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్నారు. భద్రాచలంలో పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. కార్తిక దీపాలు వదులుతున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణ మండపంలో కార్తిక పురాణ ప్రవచనం గావిస్తున్నారు. రాజన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు.

## సంక్రాంతి వరకు గుంతల రోడ్లు కనిపించొద్దు



అమరావతి, నవంబర్ 2 : రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లే తమ ధ్యేయం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి పరవాడలో గుంతలు పడిన రోడ్లను పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గుంతలు లేని రోడ్లకు శనివారం అనకాపల్లి జిల్లాలోని వెన్నెలపాలెంలో శ్రీకారం చుట్టామని తెలిపారు. గుంతల రోడ్లు నరకానికి రహదారులు అని.. రోడ్ల మీద గర్భిణీలు డెలివరీ అయ్యారని.. ఈ పాపం గత పాలకులదే అంటూ మండిపడ్డారు. గుంతల రోడ్ల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయని ఎంతోమంది చనిపోయారని అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఐదేళ్లలో రహదారుల కోసం కేవలం రూ.1000 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. మంచి రోడ్లు నాగరికతకు చిహ్నమని.. అభివృద్ధికి ఆనవాళ్లు మంచి రహదారులు అని చెప్పుకొచ్చారు. వచ్చే సంక్రాంతికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉండాలన్నారు. వర్షం వస్తే గతంలో రోడ్లు స్విమ్మింగ్ పూల్‌ను తలపించే విధంగా ఉన్నాయన్నారు. రౌడీ రాజకీయాలు వద్దని.. అభివృద్ధి రాజకీయాలు కావాలని వెల్లడించారు. "నేను ఎక్కడకు వెళ్ళినా పరదాలు లేవు, చెట్లు కొట్టడం లేదు. మళ్లీ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి. మంచి రోడ్లు వస్తాయి" అని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలను, మద్యాన్ని తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చారని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలన్నారు. డబ్బులు ఊరికనే రావు... సంపద సృష్టిస్తే డబ్బులు వస్తాయన్నారు. రూ.860 కోట్లు తో రాష్ట్రంలో మొత్తం గుంతలు పూడుస్తున్నామన్నారు. రాష్ట్రంలో జగన్ విధ్వంసం సృష్టించారన్నారు. గాడి తప్పిన వ్యవస్థలను...గాడిలో పెడతానని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని రోడ్లు వేస్తామని ఇందుకోసం ఒక పక్కా ప్రణాళిక వేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

సురక్షిత ప్రయాణం కోసమే: మంత్రి నాదెండ్ల

మరోవైపు విశాఖపట్నం పూర్ణ మార్కెట్ రామకృష్ణ థియేటర్ వద్ద గుంతల పూడ్చివేత కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గుంతలేని రహదారి కోసం ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. గతంలో రోడ్ల కోసం జనసేన సోషల్ మీడియా క్యాంపెయిన్ చేసిందని గుర్తుచేశారు. వైసీపీ కారణంగా ఈరోజు రోడ్లు గుంతలు పూడ్చుకునే స్థాయికి దిగజారాల్సి వచ్చిందన్నారు. ప్రజల సురక్షితవంతమైన ప్రయాణం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు.

గుంతల రహిత రాష్ట్రంగా ఏపీ: మంత్రి రామానాయుడు

వచ్చే సంక్రాంతి నాటికి రూ.600 కోట్లతో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సాక్షి ప్రకటనలకు ఖర్చుపెట్టిన రూ.300 కోట్లు కూడా కనీసం

## తిట్ల పురాణం పక్కన పెట్టి రహదారిని విస్తరిస్తే మంచిది..

రాజన్న సిరిసిల్ల జిల్లా : కేంద్ర మంత్రి బండి సంజయ్ తిట్ల పురాణం బందు చేసి జాతీయ రహదారి కోసం ఎక్సటెన్షన్ చేయాలని కోరుతున్నా అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఫైర్ అయ్యారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విభజన చట్టం ద్వారా ఏర్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక కేంద్రం ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చిందన్నారు. జాతీయ 365 సూర్యాపేట నుండి దుద్దెధ వరకు ఉండేది, దుద్దేడ నుండి సిరిసిల్ల మీదుగా కోరుట్లకు వరకు రహదారి విస్తరించాలని ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. జాతీయ రహదారి కోరుట్ల నుండి దుద్దెద వరకు వెన్ను పూస లాగ ఉండేలా ప్రతిపాధించామన్నారు. బండి సంజయ్ తిట్ల పురాణం బందు చేసి జాతీయ రహదారి కోసం ఎక్సటెన్షన్ చేయాలని కోరుతున్నానని అన్నారు.సిరిసిల్ల నుండి పాములాగా రహదారి వేస్తున్నారు దానిని విరమించుకోవాలని తెలిపారు. సిరిసిల్ల లో ఉన్న మధ్య తరగతి ప్రజలు రహదారి లో జాగలు కోల్పోతున్నారని మండిపడ్డారు. రైల్వే లైన్ ఎలా వస్తుందో దాని ప్రక్కన రహదారి వేసేలా కృషి చేయాలన్నారు. రాజమండ్రి లో ఉన్న మాదిరిగా తెలంగాణలో రైల్వే కం బ్రిడ్జి రహదారి నిర్మాణం చేయాలని తెలిపారు. స్వాతంత్ర్య వచ్చినప్పటి నుండి తెలంగాణ కు చాలా అన్యాయం



జరిగిందన్నారు. హైదరాబాద్ నుండి విజయవాడ, ఆర్మూరు నుండి జాగ్దేవ్ పూర్ వరకు రెండు రహదారులు రావడం జరుగుతుందన్నారు. రెండు జాతీయ రహదారి ఎక్టెన్షన్ అయ్యేలా కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ తో మాట్లాడి బండి సంజయ్ కృషి చేయాలని అన్నారు. రహదారి విస్తరణ ఎక్సటెన్షన్ చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. మంచి రోడ్డు లేకపోతే మనమే నష్టపోతామన్నారు. భూములు కోల్పోయిన వారికి రెట్టింపు పరిహారం ఇవ్వాలన్నారు.

## సంపాదకీయం

ఆదివారం 03-11-2024

# జపాన్ పాలక పార్టీకి చావు దెబ్బ !

ఆదివారం నాడు జరిగిన పార్లమెంటు ఎన్నికలలో జపాన్ పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్.డి.పి)కి చావు దెబ్బ తగిలింది. అయితే దాని అధికారం పదిలంగా ఉంటుందని చెబుతున్నారు. పార్లమెంటులోని దిగువ సభలో ఉన్న 465 స్థానాలకు గాను గత ఎన్నికలలో 34.66 శాతం ఓట్లు, 259 సీట్లు తెచ్చుకున్న ఎల్.డి.పి ఈ సారి 26.73 శాతం ఓట్లు, 191 సీట్లతో సరిపెట్టుకుంది. మిత్రపక్షం కొమిటో పార్టీ పొందిన 24తో కలిపి 215 మాత్రమే తెచ్చుకుంది. సాధారణ మెజారిటీ 233 స్థానాలను ఏ పార్టీ కూడా గెలుచుకోలేక పోయింది. ఇరవై ఎనిమిది సీట్లు తెచ్చుకున్న డిపిపి కింగ్‌మేకర్‌గా మారిందని చెబుతున్నారు. దీంతో మరోసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం లేదా పార్టీలలో చీలిక అనివార్యంగా కనిపిస్తోంది. మద్దతు కూడగట్టేందుకు వివిధ పార్టీలతో ప్రధాని షిగెరు షిబా మంతనాలు జరుపుతున్నాడు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని పాలక పార్టీ పెద్దలు పెద్ద మొత్తంలో విరాళాల వసూలు, వాటిలో కొంత నొక్కేయటం వంటి విమర్శల సునామీలో పాలక పార్టీ ఓడిపోయింది. ఎల్.డి.పి జపాన్‌లో అవినీతికి పెట్టింది పేరు. అయినప్పటికీ అక్కడి ఓటర్లు దానికి దశాబ్దాల పాటు పట్టం కడుతూనే ఉన్నారు. ఈ సారి ఓడించారంటే వారి సహనానికి అవినీతిపరులు పరీక్ష పెట్టినట్లుగా కనిపిస్తోంది. పాలక పార్టీకి చెందిన మాజీ ప్రధానులు షింజో అబే, ఫుమియో కిషిడాతో సహా 82 మంది ఎంపీలు స్వంత ఖాతాలకు నిధులు మళ్లించుకున్నట్లు విమర్శలు వచ్చాయి. దీనికి తోడు ఆర్థిక మాంద్యంతో దేశం కొట్టుమిట్టాడుతున్నది. దాన్నుంచి బయట పడవేసే మార్గం కనిపించటం లేదు. ఇవన్నీ పాలక పార్టీ, దాని మిత్ర పక్షాన్ని దెబ్బ తీశాయి. అవినీతి ఆరోపణలు ఉన్నవారిని దూరంగా పెడతామని చెప్పినప్పటికీ కొద్ది మందినే పోటీ నుంచి తప్పించటం, ఎక్కువ మందికి నిధులు కూడా సమకూర్చారనే విమర్శలు వెల్లువెత్తాయి. జనంలో అనుమానం, ఆగ్రహం తమను దెబ్బతీశాయని ప్రధాని షిబా చెప్పాడు. అవినీతి ఆరోపణల పూర్వరంగంలో ఆగస్టు నెలలో కిషిదా రాజీనామా చేయగా అధికారానికి వచ్చిన షిబా మరుసటి నెలలోనే పార్లమెంటును రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు తెరతీశాడు. వ్రతం చెడినా ఫలం దక్కలేదు.రోజూ గంటల తరబడి ఓవర్ టైమ్ చేస్తే తప్ప కార్మికులకు గడవని స్థితి. దీంతో రెండవ ప్రపంచ యుద్ధం నాటి నుంచి అలాంటి వాతావరణానికి జనాన్ని అలవాటు చేశారు. దేశం దుస్థితి నుంచి బయట పడాలంటే వ్యక్తిగత జీవితాలను త్యాగం చేయాలంటూ దేశభక్తి నూరిపోశారు. అయితే జపనీయులు ఎక్కువ గంటలు పని చేస్తారంటూ ముద్దు పేరు పెట్టి సమర్ధించుకుంటారు. అధిక పని కారణంగా మరణాలు కూడా అక్కడ సర్వసాధారణమే. వాటిని 'కరోషీ' అంటున్నారు. ప్రతి పది మందిలో ఒకరు నెలకు 80 గంటలు ఓవర్ టైమ్ చేస్తున్నారు. ప్రతి ఐదు మందిలో ఒకరు కరోషీ గుండెపోటు లేదా పని ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒకనాటి అద్భుతంగా వర్ణించిన అంశం ఇప్పుడు జాతీయ ఆరోగ్య సమస్యగా మారింది.ఈ పరిస్థితిని మార్చాలని కొందరు డిమాండ్ చేస్తున్నప్పటికీ కార్పొరేట్లు అందుకు అంగీకరించటం లేదు. అబెనోమిక్స్ పేరుతో మాజీ ప్రధాని షింజో అబె అనుసరించిన విధానాలు స్టాక్ మార్కెట్లో మదుపు చేసిన వారికి లాభాలు తెచ్చాయి తప్ప కార్మికులకు ఎలాంటి ప్రయోజనమూ చేకూరలేదు. దీనికి తోడు ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ దిగజారుదు, నిరుద్యోగ సమస్య కూడా తోడు కావటంతో కార్మికవర్గం ఆగ్రహించింది.ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ తన పదవికి ఎలాంటి ఢోకా లేదని ప్రధాని షిగెరు షిబా చెప్పాడు. ఏ పార్టీ లేదా కూటమికీ మెజారిటీ లేనందున ఎన్నికలు జరిగిన 30 రోజుల్లోగా తమ బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. ప్రతిపక్షాలకు అంత బలం లేనందున మైనారిటీ ప్రభుత్వాన్ని ఎల్‌డిపి కొనసాగించగలదని కొందరు భావిస్తున్నారు. ఇషిబా రెండవసారి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తే సరి లేకుంటే రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అతి తక్కువ రోజులు అధికారంలో ఉన్న ప్రధానిగా చరిత్రకు ఎక్కుతాడు. రెండవ పెద్ద పార్టీగా అవతరించిన కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ తన బలాన్ని 96 నుంచి 148కి మాత్రమే పెంచుకుంది. ఎల్.డి.పి లో మాజీ ప్రధాని షింజో అబే వర్గం ప్రస్తుత ప్రధాని షిబా పట్ల సానుకూలంగా లేదని, అధికార పార్టీలో చీలిక రావచ్చుని కూడా జోశ్యం చెబుతున్నారు. వచ్చే ఏడాది జులైలో ఎగువ సభ ఎన్నికలు జరగాల్సి వుంది. జపాన్ మిలిటరీ పాత్రను పెంచేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ తొమ్మిదిని సవరించాలని ఎల్.డి.పి ఎప్పటి నుంచో చెబుతున్నది. తద్వారా ప్రపంచ మార్కెట్లలో తన వంతు వాటాను పొందవచ్చని జపాన్ పాలకవర్గం భావిస్తున్నది. చైనాకు వ్యతిరేకంగా అమెరికా ప్రతిపాదిస్తున్న "ఆసియన్ నాటో" కూటమికి నాయకత్వం వహించాలని అది భావిస్తున్నది. అయితే అలాంటి సవరణను కమ్యూనిస్టు పార్టీతో సహా ప్రధాన ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పుడు పాలక కూటమి మైనారిటీలో పడినందున ఆ ఎజెండాను పక్కన పెట్టవచ్చు. అమెరికాతో అంతకంతకూ దగ్గర అవుతూనే చైనాతో సంబంధాలను విడగొట్టుకొనేందుకూ జపాన్ పాలకవర్గం సిద్ధం కావటం లేదు. ఎందుకంటే చైనాతో వాణిజ్యం వారికి ఎంతో అవసరం. ఎన్నికలు జపాన్ అంతర్గత వ్యవహారమని తాము దాని గురించి చెప్పాల్సిందేమీ లేదని చైనా ముక్తసరిగా వ్యాఖ్యానించింది. ప్రతిపక్షాల్లో 148 సీట్లు తెచ్చుకున్న సిడిపి, 38, 28 చొప్పున సీట్లు పొందిన జెఐపి, డిపిపి పార్టీలు తాము చేతులు కలిపే అవకాశం లేదని అంశాల వారీగా ప్రభుత్వానికి మద్దతు లేదా వ్యతిరేకతను వెల్లడిస్తామని పేర్కొన్నాయి. అయితే స్వతంత్రులు, చిన్న పార్టీలను కలుపుకొని ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమూ లేకపోలేదని భావిస్తున్నవారూ ఉన్నారు. అది జరగకపోతే మైనారిటీ ఎల్.డి.పి కూటమి అధికారంలో కొనసాగే అవకాశం ఉంది. అయితే ఎల్.డి.పి లోనే కుమ్ములాటలతో కొత్త నేత ముందుకు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఏది జరిగినా అస్థిరత కత్తి వేలాడుతూనే ఉంటుంది. లాబీల బేరమాడే శక్తి పెరుగుతుంది. ఎవరు అధికారానికి వచ్చినా అటు కార్మికవర్గం-ఇటు కార్పొరేట్ వర్గమూ తమ సంగతేమిటని పాలకుల మీద వత్తిడి పెంచుతాయి. తక్షణ సవాళ్లుగా ఆర్థిక అంశాలే ఉంటాయని జపనీస్ బిజినెస్ ఫెడరేషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నది.అవినీతిపరులుగా ముద్ర పడిన కొందరిని పక్కన పెట్టి ఓటర్లను సంతుష్టీకరించేందుకు షిబా ప్రకటించినప్పటికీ ఎక్కువ మందికి పెద్ద పీట వేయటంతో ఓటర్లు అతని నాయకత్వాన్ని విశ్వసించలేదు. అందరి మాదిరే అని భావించారు. అవినీతి నిరోధానికి కొత్తగా తీసుకున్న చర్యలేవీ ఓటర్లకు కనిపించలేదు. వారి ఆగ్రహాన్ని పసిగట్టటంలో ఎల్.డి.పి నాయకత్వం విఫలమైంది. పాత ముఖాలనే షీబా కూడా మంత్రులుగా తీసుకున్నాడు. కార్పొరేట్ కంపెనీల నుంచి విరాళాలు తీసుకోవటాన్ని గట్టిగా సమర్ధించాడు. పాలక పార్టీకి వస్తున్న రాబడిలో 60 శాతం వరకు కార్పొరేట్ విరాళాలే ఉన్నాయి. వాటి నిషేధం పగటి కల అన్నాడు.

# ప్రతిష్టాత్మకంగా మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు !




జార్ఖండ్,ఈ నెలలోనే పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగబోతున్నాయి. అలాగే యూపి, పంజాబ్, వయనాడ్‌లలో ఉప ఎన్నికలు కూడా ఉన్నాయి. ఓ రకంగ చెప్పాలంటే హర్యానా, కాశ్మీర్ ఎన్నికల తరవాత జరుగుతున్న ఈ ఎన్నికలు మోడీకి, రాహుల్‌కు పరీక్ష లాంటివి. అలాగే మహారాష్ట్రలో కూడా ఎన్నికలు బిజెపి కూటమికి సవాల్‌గానే చూడాలి. కాంగ్రెస్ కూటమి అక్కడ బలంగానే ఉంది. ఇకపోతే జార్ఖండ్‌లో కూడా బిజెపి ఎత్తులు వేసి హేమంత్ సోరెన్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. కేసుల్లో జైలుకు తోసింది. తిరిగి బయటకు వచ్చాక కూడా స్థిరంగా పాలన చేసుకునే పరిస్థితి లేదు. ఈ నెల 20న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగ నున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలే కాదు, యావద్దేశ జనులూ ఈఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయనే ఉత్కంఠతో ఉన్నారు. మహారాష్ట్రలోను, విశాల భాతదేశంలోను ప్రజలంతా ఇక్కడి ఎన్నికలపై ఆసక్తిగా చూస్తున్నారు. 'లడ్కీ బహిన్' పేరుతో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం సరికొత్తగా అమలు పరుస్తున్న 'సంక్షేమ' పథకం గట్టెక్కిస్తుందని నమ్మకంగా ఉన్నారు. సంవత్సరాదాయం రూ. రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్న ప్రతి కుటుంబానికి నెలా నెలా ఆ కుటుంబ గృహిణికి రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ ఉదార ఆర్థిక హాయమే చర్చనీయాంశంగా ఉన్నది. అయితే అది ఒక నిర్ణాయకమైన రాజకీయ ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నది. తెలంగాణలో కూడా ఎన్నికల ముందు రెండున్నర వేలు ఆడిబిడ్డ ఖాతాలో వేస్తామని ఇలాంటి హామీనే ఇచ్చారు. రాష్ట్రాల్లో లేదా కేంద్రం లో మరోమారు అధికారం కోసం ఎన్నికల ముందు ఇలాంటి హామీలు ఇవ్వడం అన్నది సర్వసాధారణంగా మారింది. ఓ రకంగా చెప్పాలంటే క్విడ్‌ప్రోకో లాంటిదే. తాయిలాలు ప్రకటించడం...ఎన్నికల్లో గెలవడం అన్నది కొత్త పరిభాషగా మారింది. బిజెపి కూడా ఇదే కోవలో ప్రయాణం చేస్తోంది. పేదలకు లేదా మహిళలు, లేదా బడుగు బలహీన వర్గాల ఓట్లను గంపగుత్తగా దక్కించుకునేందుకు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారు. నగదు సహాయం పేరిట లంచాలు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. ఓటర్లకు ప్రత్యక్ష నగదు చెల్లింపులు చేయడం అన్నది ఎన్నికల్లో జరుగుతూనే ఉంది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర ఎన్నికల్లో ఏక్‌నాథ్ షిండే తన అధికారం నిలుపుకునేందుకు లడ్కీ బహిన్ పథకం తీసుకుని వచ్చారు. ఇలా ఆర్థిక సహాయం అందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నెలకు ఇంచుమించు రూ.3700 కోట్లు వెచ్చించనున్నది. వార్షికంగా రూ.46 వేల కోట్ల భారం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్నది. మహారాష్ట్ర ప్రభుత్వ రుణభారం ఇప్పటికే రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నదని అంచనా. ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అగాఢీని చిత్తుచేసేందుకు ఉద్దేశించిన తెలివైన రాజకీయంగా దీనిని చెప్పుకోవాలి. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో పాలక మహాయుతి కూటమి రాష్ట్రంలోని 48 ఎంపి సీట్లలో కేవలం 17ను మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ కారణంగా ఓటర్ల బృందాలను ఆకట్టుకునే క్రమంలో లడ్కీ బహిన్ పథకాన్ని ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. మహిళలు, యువత లక్ష్యంగా లడ్కీ బహిన్, నిరుద్యోగ యువతకు 'లడ్కా భావు' పేరిట నగదు సహాయం చేసేందుకు షిండే సర్కార్ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమి రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్న నినాదంతో బిజెపిని ముచ్చెమటలు పోయించింది.ఈ ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో ఇప్పుడు షిండే ప్రభుత్వం నగదు ఆధారిత పథకాలను శాసనసభ ఎన్నికల ప్రధాన ప్రచారాంశంగా చేయడం గమనార్హం. ఇక జార్ఖండ్‌లోనూ ఇండియా కూటమి బాగానే పనిచేస్తోంది. ఇక్కడ సంక్షేమ పథకాల వైపు మొగ్గుతారా? సానుభూతి అంశాలకు పీటవేస్తారా? అన్నది జార్ఖండ్ ఓటర్ల మనోభావాల మీద గెలుపోటములు ఆధారపడ్డాయి. ఇద్దరి అమ్ముల పొదిలోనూ ఈ రెండంశాల విడివిడి అస్త్రాలున్నాయి. 18-50 ఏళ్ల మధ్య వయస్కులైన ప్రతి మహిళకు నెలనెలా వెయ్యి రూపాయలిచ్చే 'మయ్యా సమ్మాన్ యోజన' తో 53 లక్షల మంది లబ్దిదారులు ప్రయోజనం పొందుతున్నారు. దీంతోపాటు 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లుల మాఫీ వల్ల 40 లక్షల కుటంబాలు, వ్యవసాయ రుణాల మాఫీ వల్ల 1.7 లక్షల కుటుంబాలు తమకు సానుకూలంగా ఉన్నారని, వారే ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకుంటారని జెఎంఎం, 'ఇండియా' నమ్మకంతో ఉంది. దీనికి ధీటుగా బిజెపి కూడా తాయిలాలను ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు కనీస నెలసరి ఆదాయం అందించడం, ఉచిత వంటగ్యాస్, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి, గృహ సదుపాయం.. 'పాంచ్ ప్రాణ్' అమల్లోకి తెస్తామని బిజెపి ప్రచారం చేస్తోంది. ఇవికాకుండా.. బిజెపి ఆదివాసీ వ్యతిరేక పార్టీ అని, అందుకే ఎస్‌టిలకు ప్రాధాన్యత ఇవ్వకపోగా సిఎం హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుపాలు చేసిందని జెఎంఎం ప్రచారం ఉధృతం చేస్తోంది. సరిహద్దుల నుంచి వచ్చే బంగ్లాదేశ్ చొరబాటుదారుల వల్ల స్థానిక ఆదివాసీల ప్రయోజనాలకు తీవ్రభంగం వాటిల్లుతోందని, తాము అధికారంలోకి వస్తే ఈ పరిస్థితిని ఎన్‌ఆర్‌సి అమలుతో కట్టడిచేస్తామని బిజెపి చెబుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ 'ఇండియా' ఎన్‌డిఎ కూటములుగా ముఖాముఖి తలపడుతున్నాయి. తెలంగాణ లాగానే జార్ఖండ్ కూడా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది. 2000లో బీహార్ రాష్ట్ర విభజన జరిగి, జార్ఖండ్ ఏర్పడింది. 24 ఏళ్లలో ఇది అయిదో ఎన్నిక. నవంబరు 13, 20 తేదీల్లో రెండు విడతలుగా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. నవంబరు 23న ఓట్ల లెక్కింపు. ప్రతి రాష్ట్ర ఎన్నిక లాగానే, జార్ఖండ్ ఎన్నికల్ని కూడా బిజెపి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. మాజీ ముఖ్యమంత్రి చాంపయ్ సోరన్ తో పాటు పలువురు పేరున్న నాయకుల్ని పార్టీలోకి తిరిగి తెచ్చుకుంది. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న అర్జున్ ముండే ముఖ్యమంత్రి అభ్యర్థి అయ్యే అవకాశాలున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. సోరెన్ లాగే, సంతాలీ అయిన మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండిని ఏడాది కిందటే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని చేసింది. ఈ ముగ్గురే కాకుండా మరో మాజీ ముఖ్యమంత్రి మధు కోడా సేవల్ని కూడా ఉపయోగించు కుంటోంది. రెండు నెలల వ్యవధిలో రెండు మార్లు రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ, ఎన్నికల పక్రియ ముగిసే లోపు మరో ఆరేడు సార్లు పర్యటించేలా ప్రచార ప్రణాళిక రచిస్తున్నారు. దానికి తోడు కేంద్ర ఇతర మంత్రులు, పలువురిని ప్రచారంలో మోహరిస్తున్నారు. మొత్తంగా మహారాష్ట్రలో అధికారం నిలబెట్టుకోవడం, జార్ఖండ్‌లో అధికారం దక్కించుకోవడం లక్ష్యంగా బిజెపి పావులు కదుపుతోంది. అయితే ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు బిజెపిని వెన్నాడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఎవరిని ఆదరిస్తారన్నది చూడాలి.

# నాసిరకం మద్యం అమ్మితే చర్యలు తప్పవు

శ్రీకాకుళం, ఉచితంగా ఇసుక ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వం అని సిఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. ఇసుక విషయంలో అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు కింద అరెస్టు చేస్తామని కూడా హెచ్చరించారు.. మా హయాంలో నాసిరకం మద్యం ఉండదు. బెల్టు షాపులు ఉండవు. బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తానని కూడా హెచ్చరించారు. కనీవినీ ఎరుగని విజయాన్ని అందించిన ప్రజల కోసం అనునిత్యం కష్టడతాం అని అన్నారు. మహిళలు అన్ని వేళలా ఆత్మగౌరవంతో జీవించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దీపం 2.0లో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈదుపురంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో సీఎం మాట్లాడారు. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలని చెప్పిన విషయం నాకు గుర్తుంది. గ్యాస్ సిలిండర్‌కు మీరు కట్టిన డబ్బు 48 గంటల్లో రిఫండ్ అయ్యేలా చూస్తాం. సిలిండర్‌కు డబ్బు కట్టే పనిలేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కట్టెల పొయ్యితో మహిళలు పడిన బాధలు నాకు తెలుసు. దీపం పథకం కింద సిలిండర్ ఇచ్చి మహిళల కష్టాలు తీర్చా. డ్వాక్రా సంఘాలకు మళ్లీ పూర్వ వైభవం తెస్తాం. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా మారుస్తాం అని అన్నారు. 64లక్షల మందికి పింఛను ఇస్తున్న ప్రభుత్వం మనదేనని గుర్తు చేశారు అన్ని రాష్ట్రాల కంటే మనమే ఎక్కువ పింఛను ఇస్తున్నాం అని అన్నారు. ఆర్థిక సమస్యలు ఉన్నా పథకాలు అమలు చేస్తున్నాం. ప్రభుత్వం వద్ద డబ్బు లేదు.. ప్రజలకు అండగా ఉండాలనే మనసుంది. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు అండగా ఉన్నాం. పింఛను మొత్తాన్ని 3 నెలలకు ఒకసారి కూడా తీసుకోవచ్చున్నారు. పింఛను ఎవరు ఆపినా నిలదీయండి.. అది మీ హక్కు. పింఛను డబ్బును ఇంటి వద్దే గౌరవంగా ఇవ్వాలని ఆదేశించామని అన్నారు. ఇకపోతే అమరావతిని మళ్లీ పట్టాలపైకి ఎక్కించామని అన్నారు. అమరావతిని మళ్లీ గాడిలో పెట్టాం. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించింది. విశాఖను ఆర్థిక రాజధాని చేస్తామన్న హామీని నిలబెట్టుకుంటామని చెప్పారు. పోలవరం కోసం రూ.990 కోట్లతో కొంత్త దయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. ఫేజ్-1 కింద కేంద్రం రూ.12,500 కోట్లు ఇచ్చిందని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు రాజీలేని పోరాటం చేశారు. వైకాపా నేతలు ప్రజాస్వామ్య హద్దులు దాటి ఇబ్బంది పెట్టారు. బాధ్యతగల ప్రజాప్రతినిధిని.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టను, రాజకీయ కక్షసాధింపులకు పోను. నాయకుడు అంటే ప్రజల మనస్సుల్లో అభిమానం ఉండాలి. సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిని నేను అని బాబు వివరించారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చాం. ఇప్పటికే రెండు.. మూడు సమావేశాలు జరిగాయి. కేంద్రం డబ్బులు కూడా ఇచ్చింది. రెండో ఫర్నేస్‌లో ఆపరేషన్ ప్రారంభమైంది. విశాఖ రైల్వే జోన్‌కు లైన్ క్లియర్ చేశాం. రేపో.. ఎల్లుండో భూమి పూజ చేస్తాం. టెక్కలి లేదా పలాసలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తాం. మూలపేటలో 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉ



ద్యోగాలు డిసెంబరు లోపు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అర్హులైన అందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు ఇస్తాం' అని చంద్రబాబు వివరించారు.ఒక్క అవకాశం అంటూ వచ్చి.. జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ధ్వజమెత్తారు. చంద్రబాబు ఇచ్చిన దీపం వెలుగులను వైకాపా ప్రభుత్వం ఆర్పేసిందన్నారు. ఉద్దానం సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కోరారు. ఉత్తరాంధ్ర యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉత్తరాంధ్రకు పరిశ్రమలు తెచ్చి వలసలు అరికడతామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే అశోక్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇకపోతే పథకం శుక్రవారం ప్రారంభమైంది. దీపం 2.0లో భాగంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురంలో లబ్దిదారులుకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను సీఎం చంద్రబాబు స్వయంగా అందజేశారు. అనంతరం లబ్దిదారుడి వంటింట్లోకి వెళ్లి సీఎం చంద్రబాబు గ్యాస్ స్టవ్ వెలిగించి.. టీ పెట్టారు. ఆ తర్వాత ఆ టీని పౌర సరఫరాల శాఖ మంత్రి నాందెడ్ల మనోహార్, కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో కలిసి సీఎం చంద్రబాబు తాగారు. మరోవైపు సీఎం చంద్రబాబు తన నివాసానికి వచ్చి స్వయంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో భాగంగా సిలిండర్ అందజేయడం పట్ల లబ్దిదారుడి కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను 4 నెలలకు ఒకటి చొప్పున లబ్దిదారులకు పంపిణీ చేయనున్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఈ పథకాన్ని ప్రారంభించారు.

### రెండు కుటుంబాల మధ్య ఘర్షణ... ముగ్గురు మృతి

అమరావతి,ఏపీలోని కాకినాడ జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని కాజులూరను మండలం శలపాకలో రాత్రి రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు మరణించారు. ఈ ఘర్షణలో కత్తులతో దాడులకు దిగడంతో బత్తుల రమేష్, బత్తుల చిన్ని, బత్తుల రాజు మృతి చెందగా, బత్తుల శ్రీనుకు తీవ్రగాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు.

# ఉచిత బస్సు ప్రయాణంపై కీలక ప్రకటన

నంద్యాల,ఏపీలో మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. దీపం పథకం మొదలుకానున్న నేపథ్యంలో మరో పథకంపై మంత్రి గుడ్ న్యూస్ చెప్పారు. సంక్రాంతి లోపల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇప్పటికే పెంచిన పింఛన్లను పంపిణీ చేస్తున్నామని.. ఇక దీపం పథకాన్ని మొదలు పెడుతున్నామని తెలిపారు. అలాగే సంక్రాంతి లోపల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఉద్యోగాలు కల్పించేందుకు ఎన్నో పరిశ్రమలు తీసుకొస్తున్నామన్నారు. తల్లికి చెల్లికి న్యాయం చేయలేని జగన్.. చంద్రబాబు ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ ఎన్ని మాటలు చెప్పినా జనం నమ్మరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా ప్రభుత్వానికి ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందని తెలిపారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని జగన్ ఏవేవో ఊహించుకొని మాట్లాడుతున్నారన్నారు. రెండు రోజులు ఏపీలో.. ఆరు రోజులు బెంగళూరు ప్యాలెస్‌లో ఉండే జగన్‌కు ప్రజల గురించి ఏం తెలుసు అంటూ మంత్రి బీసీ జానార్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎన్‌ఆర్‌ఐలకు అర్థం చెప్పిన మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ, ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రెండు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి టిక్కెట్ కొనుక్కొని వచ్చి మరీ ఓటేశారని అభినందించారు. కొందరు ఏడాదిపాటు ఏపీలోనే ఉండి సేవలందించారని మెచ్చుకున్నారు. ఎన్నికల్లో 175కి 175 అన్నవారి ముఖాలు మాడిమసైపోయాయని, ఈ గెలుపు ప్రపంచంలో ఉన్న తెలువారందరిది అని లోకేశ్ అన్నారు. ఈ మేరకు అమెరికాలో గురువారం మాట్లాడారు. ఎన్నారైలు అంటే ఎంతో నమ్మకమైన భారతీయులు అని మంత్రి నారా లోకేశ్ కొత్త అర్థం చెప్పారు. "అందరూ మిమ్మల్ని ఎన్‌ఆర్‌ఐలు అని అంటారు. కానీ నేను మాత్రం ఎప్పుడూ మిమ్మల్ని ఎంఆర్‌ఐలు అనే అనుకుంటా. కానీ ఎంఆర్‌ఐ అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. మీ జోష్, ఎనర్జీ చూస్తుంటే నేను అట్లాంటాలో ఉన్నానా?. అమలాపురంలో ఉన్నానా? అనే డౌట్ వస్తోంది. మీరు దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రేమిస్తారు. అమెరికాలో ఉన్నా మీ మనసంతా రాష్ట్రం వైపే ఉంటుంది. రాష్ట్రం బాగుండాలి, అభివృద్ధి చెందాలి అని కోరుకుంటారు. అందుకే మీరు మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. సంపాదించిన రూపాయిలో 10 పైసలు సొంతగడ్డకు ఖర్చు పెడుతున్నారు" అని కొనియాడారు. అట్లాంటా సమీపంలోని కుమ్మింగ్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించాను. ఈ సందర్భంగా హెలికాప్టర్ పైనుంచి మంత్రి మీద పూలవర్షం కురిపించి ఎన్‌ఆర్‌ఐ టీడీపీ కార్యకర్తలు అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రపంచవ్యాప్తంగా తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ ఆశయ సాధనకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోంది. గత ప్రభుత్వంలో చేయని తప్పునకు బాబుగారిని జైలులో బంధించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారంతా ఎన్‌ఆర్‌ఐలతో సహా రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. ఆ సమయంలో మీరు ఇచ్చిన మద్దతు మాకు కొండంత బలాన్నిచ్చింది" అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

రెడ్‌బుక్‌లో రెండో అధ్యాయం మొదలు...

ఇక వారం రోజుల అమెరికా పర్యటనలో రాష్ట్రాన్ని ప్రమోట్ చెయ్యడానికి అవిశ్రాంతంగా ఇన్వెస్టర్స్‌ని కలిశానని లోకేశ్ చెప్పారు. "నిర్విరామంగా ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరిపాను. కానీ ఈ రోజు మిమ్మల్ని చూసిన తరువాత నాకు కిక్ వచ్చింది. ఎన్‌ఆర్‌ఐలు కూడా సైకో జగన్ బాధితులే. రెడ్ బుక్‌లో ఒక చాప్టర్ అయిపోయింది. రెండోది ఓపెన్ అయింది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సహకారంతో త్వరలో మూడో చాప్టర్ తెరవబోతున్నా. అతి పెద్ద వ్యవస్థలో కొన్ని పొరపాట్లు జరుగుతుంటాయి. మా దృష్టికి తెస్తే సరిచేసుకుంటాం. మీకు ఉన్న సమస్యలు కొన్ని నా దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తా. తెలుగువారు ప్రపంచాన్ని శాసించేస్థాయికి ఎదగాలన్నది బాబుగారి ఆశయం. ఎన్‌ఆర్‌ఐలు ఏపీలో పెట్టుబడి పెట్టండి, మీకు అండగా నిలిచే బాధ్యత నాది. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్తాం" అని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు.

# స్ట్రాంగ్ లీడర్ కావాలా?

జహీరాబాద్.. ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీన్ మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థులు హ్యాట్రిక్ విజయం దక్కించుకున్నారు. ఐతే ఇప్పుడు జహీరాబాద్‌లో కాంగ్రెస్‌కు గెలుపు గుర్రం అవసరం అయింది. ఓ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. దీంతో కాంగ్రెస్‌లో రాజకీయం ఒక్కసారిగా మారిపోయింది. ఇంతకీ జహీరాబాద్‌లో ఏం జరుగుతోంది.. ఎవరి బెర్త్.. ఎవరికి ఎర్త్ పెడుతోంది.మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం.. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. బగారెడ్డి , గీతారెడ్డిలాంటి హేమాహేమీలు ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా నిలిపారు. బాగారెడ్డి మరణం తర్వాత.. గీతారెడ్డితో పాటు దివంగత ఫరీదుద్దీన్.. నియోజకవర్గంపై పార్టీ పట్టు సడలకుండా కాపాడారు. 2018లో గీతారెడ్డి ఓటమితో కాంగ్రెస్ ప్రాబల్యం తగ్గిపోతూ వస్తోంది.వరుసగా రెండుసార్లు బీఆర్‌ఎస్ విజయం సాధించింది. 2023 ఎన్నికల్లో గీతారెడ్డి పోటీకి దూరంగా ఉన్నారు. దీంతో మాజీ మంత్రి చంద్రశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. 12వేలకు పైగా ఓట్ల తేడాతో.. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్ రావు చేతిలో ఓడిపోయారు. గీతారెడ్డి దూరంగా ఉండడం.. చంద్రశేఖర్‌కు నియోజకవర్గ పార్టీ శ్రేణులపై పట్టు లేకపోవడంతో.. జహీరాబాద్‌లో కాంగ్రెస్‌కు కొత్త నాయకుడి అవసరం ఏర్పడిందనే టాక్ నడుస్తోంది. 2018 ఎన్నికల్లో ఓటమి తర్వాత.. గీతారెడ్డి నియోజవర్గానికి రావడమే తగ్గించారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో 2023 ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు.జహీరాబాద్ ఎంపీపీగా ఉన్న గిరిధర్ రెడ్డి.. పార్టీని నడిపిస్తూ వచ్చారు. గత ఎన్నికల్లో చంద్రశేఖర్‌కు గిరిధర్ రెడ్డి వర్గం గట్టిగానే సపోర్ట్ చేసినా.. గీతారెడ్డి వర్గం నుంచి మాత్రం ఎలాంటి సహకారం అందలేదని తెలుస్తోంది. చంద్రశేఖర్ కోసం గీతారెడ్డి కనీసం ప్రచారం కూడా చేయలేకపోయారు. దీంతో గెలవాల్సిన సీటు కాస్త బిఆర్‌ఎస్ ఖాతాలోకి వెళ్లిపోయిందనే చర్చ నడుస్తోంది.

వీరి పరిస్థితి ఏంటి?

ఇక అసెంబ్లీ ఎన్నికల తర్వాత గీతారెడ్డి జహీరాబాద్‌కు వచ్చిందే లేదు. దీంతో ఆమె జహీరాబాద్‌కు దాదాపు దూరం అయినట్లే అనే చర్చ జరుగుతోంది. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా..

# అనలాగ్ స్పేస్ మిషన్‌ను ప్రారంభించిన ఇస్రో

న్యూఢిల్లీ, భారత అంతరిక్ష సంస్థ ఇస్రో తొలి అనలాగ్ స్పేస్ మిషన్‌ను లద్దాఖ్ లేహ్‌లో ప్రారంభించింది. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్, ఆకా స్పేస్ స్టూడియో, లడఖ్ విశ్వవిద్యాలయం, ఐఐటీ బాంబే, లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో ఈ మిషన్ చేపట్టింది. మిషన్‌లో భాగంగా ఇస్రో లేహ్‌లో ఓ స్పేస్‌ను సృష్టిస్తుంది. ఇందులో మరో గ్రహంలో పరిస్థితులు ఎలా ఉంటాయో అలాగే ఉంటాయి. దాంతో భూమికి దూరంగా ఉన్న ప్రదేశాల్లోని బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఇస్రో సన్నాహాలు చేయనున్నది. ఇస్రో లేహ్‌లో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ మిషన్ ఇదే. అంతరిక్షం, ఏదైనా ఖగోళ వస్తువు తరహాలో వాతావరణం, పర్యావరణాన్ని పోలి ఉంటుంది. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దుతుంటారు. అందులో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టనున్న విషయం తెలిసిందే. ఇందులో కీలకమైన మిషన్ గగన్‌యాన్. ఇందులో మిషన్‌లో తొలిసారిగా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపబోతున్నది. ఈ పరిస్థితుల్లో అనలాగ్ మిషన్ కీలకంగా మారనున్నది. రాబోయే కాలంలో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. లద్దాఖ్‌లోని వాతావరణ పరిస్థితులు కొంత వరకు చంద్రుడు, మార్స్ పరిస్థితులను పోలి ఉంటాయి. చల్లని, పొడి వాతావరణం, ఎక్కువ ఎత్తు ఉండడంతో ఇక్కడి నుంచి దీర్ఘకాలిక అంతరిక్ష మిషన్ల కోసం సన్నాహాలకు ఉపయుక్తంగా ఉండనున్నది. అనలాగ్ మిషన్‌లో పాల్గొనేవారంతా ఇతర గ్రహాలు, స్పేస్‌షిప్‌ల్లో ఉండే పరిస్థితులు అనుభవిస్తారు. భవిష్యత్‌లో ఇక్కడే అంతరిక్ష యాత్రకు సిద్ధం కానున్నారు. నిర్వహణ, మానసిక స్థితిని సైతం శాస్త్రవేత్తలు పర్యవేక్షించనున్నారు.

# భారీగా పెరిగిన ఆదాయం.. భారత్‌లో మరో నాలుగు స్టోర్లు

న్యూఢిల్లీ, భారత్‌లో యాపిల్ ఐఫోన్ల విక్రయాలు ఊపందుకున్నాయి. ముంబై, ఢిల్లీలో ఉన్న రెండు స్టోర్ల ద్వారా భారీగా ఆదాయం సమకూరుతోంది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీకి ఐఫోన్ విక్రయాల ద్వారా భారత్ నుంచి వస్తోన్న ఆదాయం గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో దేశవ్యాప్తంగా ఐఫోన్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే మరో నాలుగు స్టోర్లను ప్రారంభించనున్నట్లు సంస్థ సీఈవో టిమ్ కుక్ తాజాగా ప్రకటించారు. 'మొదటి త్రైమాసికంలో రెండు కొత్త స్టోర్‌లను ప్రారంభించాం. ఢిల్లీ, ముంబైలో ఈ అవుట్‌లెట్లను ఏర్పాటు చేశాం. త్వరలోనే భారత్ కస్టమర్లకు నాలుగు కొత్త స్టోర్‌లను తీసుకురాబోతున్నాం' అని యాపిల్ సీసీవో వెల్లడించారు. కాగా, కొత్త స్టోర్లను ఏయే నగరాల్లో ప్రారంభిస్తారన్న విషయాన్ని మాత్రం టిమ్ కుక్ వెల్లడించలేదు. అయితే, పుణె, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైలలో కొత్త స్టోర్లను నెలకొల్పనున్నట్లు యాపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డియర్‌డ్రి ఓబ్రియాన్ ఇటీవలే తెలిపిన విషయం తెలిసిందే. ఇక ప్రస్తుతం భారత్‌లో రెండు యాపిల్ స్టోర్లు మాత్రమే ఉన్న విషయం తెలిసిందే. ఒకటి ముంబైలోని బీకేసీలో ఉండగా.. మరొకటి ఢిల్లీలోని సాకేత్‌లో ఉంది. వీటిని 2023లో యాపిల్ అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలను యాపిల్ తాజాగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఐఫోన్ విక్రయాలు భారీగా పెరిగి ప్రపంచ రికార్డులను నెలకొల్పినట్లు సీఈవో టిమ్ కుక్ ఈ సందర్భంగా తెలిపారు. కంపెనీ రెవెన్యూ గతంలో కంటే 6 శాతం పెరిగి 94.9 బిలియన్ డాలర్లు అంటే రూ.7.9 లక్షల కోట్లుకు చేరినట్లు తెలిపారు. 'యాపిల్ తాజా త్రైమాసిక ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఆదాయాన్ని నమోదు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా భారీగా ఐఫోన్ అమ్మకాలు జరిగాయి. యూఎస్, యూరప్, బ్రెజిల్, మెక్సికో, ఫ్రాన్స్, బ్రిటన్, కొరియా సహా పలు దేశాల్లో రికార్డు స్థాయిలో ఆదాయం అర్జించింది. ప్రత్యేకించి భారతదేశంలో యాపిల్ ఐఫోన్ సేల్స్ గరిష్ఠాలను చేరుకున్నాయి. భారత్ నుంచి వచ్చే ఆదాయం సరికొత్త రికార్డును నెలకొల్పింది' అని టిమ్ కుక్ వెల్లడించారు.

# కొత్త కన్‌ఫ్యూజన్..

హైదరాబాద్, ఏమన్నా అంటే అన్నారు అంటారు కానీ.. ఆ పార్టీలో ఎప్పుడూ పంచాయితీలే. ఆ నేత వస్తే ఈయన ఉండరు.. ఈయన వెళ్తే ఆయన మాట్లాడరు. ఇది ఆ పార్టీలో నెలకొన్న ప్రజెంట్ పొలిటికల్ పంచాయితీ. అలాంటి పార్టీ ఇప్పుడు స్థానిక సంస్థలు, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధం అవుతోంది. సింగిల్ పాయింట్ ఎజెండానే ప్రధానాస్త్రంగా ఆ పార్టీ ముందుకెళ్లాలని డిసైడ్ అయిందట. హైడ్రా మొదలుకొని మొన్నటి ముత్యాలమ్మ టెంపుల్ ఘటన వరకు మైలేజ్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్న ఆ పార్టీ ఎంచుకున్న బ్రహ్మాస్త్రం ఏంటి?తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తై సంవత్సరం, పార్లమెంట్ ఎన్నికలు పూర్తై ఐదు నెలలు కావొస్తుంది. ఎన్నికలప్పుడు ప్రజాక్షేత్రంలో కనిపించిన కమలం పార్టీ నేతలు ఆ తర్వాత అడ్రస్ లేకుండా ఉన్నారట. నేతల మధ్య పంచాయితీలకే టైం సరిపోవడం లేదట.. అలాంటి వాళ్లు ప్రజాపోరాటాలకు ఏం టైమ్ ఇస్తారని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ పునరుజ్జీవం, హైడ్రా వంటి ప్రాజెక్ట్ లపై బీజేపీ పోరాటాలు పెద్దగా ఫలించలేదనే టాక్ ఆ పార్టీలోనే వినిపిస్తోంది.ప్రజాపోరాటాల్లో ఆశించినంత స్థాయిలో మైలేజ్ రాకపోతుండటంతో ఆపార్టీలో అసంతృప్తి రాగాలు సైతం గట్టిగానే వినిపిస్తోన్నాయి. అందుకే ప్రజాపోరాటాలు కాదు.. హిందూత్వ ఎజెండాను నమ్ముకుందామంటోంది బీజేపీ. అందులో భాగంగానే రాష్ట్ర నాయకత్వంతో పాటు, ఢిల్లీ పెద్దలు సైతం హిందుత్వ ఎజెండానే కీలకమనే అంచనాకు వచ్చినట్టుగా తెలుస్తోంది. హిందుత్వ ఎజెండాతోనే అడుగులు వేస్తే కచ్చితంగా వచ్చేకాలంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని కాషాయ వర్గాలు భావిస్తున్నాయి. అందులో భాగంగానే మొన్న జరిగిన ముత్యాలమ్మ ఎపిసోడ్ లో రచ్చరచ్చ చేయాలని ఆ పార్టీ నేతలు చూశారు.పొలిటికల్ మైలేజ్ కోసం ముత్యాలమ్మ మాదిరి పంచాయితీలు సృష్టించడం కరెక్టేనా అనే బేసిక్ విషయాన్ని ఆ పార్టీ నేతలు మర్చిపోతున్నారు. నేతల మధ్య విభేదాలు కొనసాగుతుండగానే రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ ఎన్నికలకు కమలం పార్టీ పాచికలు వేయడం ప్రారంభించింది. త్వరలో ఖాళీ కానున్న రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానాలపైన కాషాయ పార్టీ ఫోకస్ చేస్తోంది. ప్రస్తుతం శాసనమండలిలో బీజేపీకి ఒక ఎమ్మెల్సీ మాత్రమే ఉంది. ఈనేపథ్యంలో త్వరలో జరగబోయో ఈ మూడు స్థానాల్లో ఎమ్మెల్సీలను కైవసం చేసుకుని బలం పెంచుకోవాలనే ప్లాన్ చేస్తోంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలకు టాస్క్ గా మారిందనే చెప్పవచ్చు.

# లక్షల మందికి 'ఉపాధి' సున్నా



న్యూఢిల్లీ,దేశంలో నిరుద్యోగం తీవ్రంగా పెరిగిపోతున్న దశలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్(ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) నుంచి 39 లక్షల మందిని తొలగించడం వివాదంగా మారింది. ఈ స్కీమ్‌కు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్ నుంచి ఎన్‌జిఒ సేకరించిన డేటా ప్రకారం 45.5 లక్షల మందిని చేర్చుకోడానికి బదులు 84.8 లక్షల మందిని తొలగించినట్టు వెల్లడైంది. అంతేకాదు క్రియాశీలక కార్మికులు 8 శాతం మంది ఈ పథకం నుంచి వెనక్కు తగ్గారని ఈ వెబ్‌సైట్ ద్వారా తేలింది. దీన్ని బట్టి గత ఏడాదితో పోల్చి చూస్తే లబ్ధిదారులు చాలా తక్కువ మందే ఇప్పుడు ఈ పథకంలో ఉన్నట్టు స్పష్టమవుతోంది.అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ స్కీమ్ జాబ్ కార్డ్ డేటాను కఠినంగా పరిశీలించడం నిరంతరం జరుగుతున్న ప్రక్రియ. ఏ జాబ్ కార్డునైనా రద్దు చేయడానికి కట్టుదిట్టమైన ప్రమాణాలు ఉన్నాయి. ఉదాహరణకు జాబ్ కార్డు నకిలీదైనా లేదా డూప్లికేట్ అయినా లేదా లబ్ధిదారులు ఎవరైనా సజీవంగా లేకపోయినా, ఆయా జాబ్ కార్డులను తొలగించవచ్చు. ఆయా కుటుంబాలు ఇందులో ఎక్కువ కాలం పనిచేయడానికి ఇష్టపడకపోయినా లేదా లబ్ధిదారులు ఎవరైనా తమ గ్రామ పంచాయతీ నుంచి వేరే చోటకు చక్కని ఉపాధి కోసం తరలివెళ్లినా, వారు జాబ్ కార్డులను కోల్పోతారు. కానీ ఇక్కడ ఆందోళనకరమైన విషయమేమంటే పొరపాటున కార్డులను రద్దు చేయడం.కేవలం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 15% వరకు పొరపాటున జాబ్ కార్డులను రద్దు చేశారు. ఎన్‌జిఒ 'లిబ్‌టెక్ ఇండియా' అధ్యయనంలో ఇది వెల్లడైంది. డేటా ప్రక్షాళనలో భాగంగా ఈ పొరపాటు జరిగింది. ఫలితంగా ఈ ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద ఉపాధి అవకాశాలు గత ఏడాది ఇదే కాలంలో 184 కోట్ల వ్యక్తిగత పని దినాలు ఉండగా, ఈ ఏడాది 154 కోట్ల పనిదినాలకు తగ్గిపోయాయి. మరో విధంగా వివరించాలంటే ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో వ్యక్తిగత పనిదినాలు 16.6% వరకు తగ్గిపోయాయి. దీనికి విరుద్ధంగా 2022-23 మధ్య ఇదే కాలంలో వ్యక్తిగత పనిదినాలు 10% వరకు అంటే 166 కోట్ల వరకు పెరగడం గమనార్హం. 202324 పూర్తి ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత పని దినాలు 309.01 కోట్ల వరకు పతాక స్థాయిలో నమోదయ్యాయి.అంతకు ముందు సంవత్సరం 202021 లో కరోనా మహమ్మారి ఉధృతంగా ఉన్న కాలంలో 389.09 కోట్ల పని దినాలు నమోదయ్యాయి. మరో ఆందోళనకరమైన పరిణామం ఏమంటే దేశం మొత్తం మీద దాదాపు 6.7 కోట్ల మంది కార్మికులు కేవలం ఆధార్ కార్డు లేని కారణంగా ఈ పథకానికి అనర్హులు గానే మిగిలిపోతున్నారు. ఈ పథకం కింద నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి జనవరి 1 నుంచి ఆధార్ ఆధారిత వేతనాల చెల్లింపు వ్యవస్థ (ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్)ను ప్రవేశపెట్టారు. ఈ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ గ్రామీణ భారతంలో ఈ విధానం ఒక సవాలుగా మారింది. కాగితాల మీద మాత్రం ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్ ఈ పథకానికి ఏమాత్రం అడ్డంకి కాదని ప్రభుత్వం ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో చూస్తే ఇదే పెద్ద అడ్డంకిగా నడుస్తోంది. ఎబిపిఎస్‌తో పాటు అనేక కారణాల వల్ల పేద ప్రజలు ఈ పథకం నుంచి లబ్ధిపొందలేని పరిస్థితి దాపురించింది. అసలు మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఈ పథకం వివాదాలమయమై నీరుగారిపోతోంది.ఉదాహరణకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఈ ఉపాధి పథకం అస్తవ్యస్తంగా ఉందన్న ఆరోపణలతో కేంద్రం నిధులు కేటాయించడం ఆపేసింది. ఈ మేరకు 2022 మార్చి 9న ఉత్తర్వు జారీ చేసింది. అనుకోకుండా నిధులు ఆపేయడంపై పశ్చిమబెంగాల్ ఉపాధి కార్మికుల్లో ఆందోళన తీవ్రమైంది. దీనిపై 2024 సెప్టెంబర్ 24న కలకత్తా హైకోర్టు ఈ పథకం అమలులో లోపాలు ఉన్నప్పటికీ కొనసాగించడం తప్పనిసరి అంటూ తీర్పు వెలువరించింది. ఏదేమైనా నిధులు ఆపేయడం 20212022, 2022, 2023 ఆర్థిక సంవత్సరాల్లో తీవ్ర ప్రభావం చూపించింది. కొవిడ్19 తరువాత పశ్చిమబెంగాల్ పొరుగున ఉన్న రాష్ట్రాల్లో ఉపాధి కార్మికుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో 12%, జార?ండ్‌లో 20% వరకు కార్మికులు తగ్గిపోయారు.పశ్చిమబెంగాల్‌లో మాత్రం ఆ కాలంలో క్రమంగా 82%, 100% వరకు కార్మికుల సంఖ్య తగ్గిపోవడం గమనార్హం. జార?ండ్ రాష్ట్రం కూడా ఉపాధి నిధుల మంజూరులో జాప్యంతో అల్లాడుతోంది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి నైపుణ్యంలో శిక్షణ ఇప్పిస్తామని, ప్రైవేట్ సంస్థల్లో వారికి ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఈ పథకం నిధుల మంజూరులో వివక్ష చూపించడం గ్రామీణ నిరుద్యోగులపై గొడ్డలివేటు పడినట్టే.

# అమెరికా ఓటర్లకు 'యుద్ధ' భయం

అమెరికా,అమెరికా అధ్యక్ష ఎన్నికలపై పశ్చిమాసియాకు సంబంధించి మూడు అంశాలు ప్రభావం చూపనున్నాయి. మొదటి అంశం.. అనుకున్నట్టుగానే ఇరాన్ మిలిటరీ వ్యవస్థను టార్గెట్ చేసుకుని ఇజ్రాయెల్ భీకర దాడులు జరిపింది. అయితే ఇక్కడ అసాధారణం ఏమంటే అంతవరకు ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రచ్ఛన్న యుద్ధం సాగిస్తున్నప్పటికీ ఆ దాడులను తామే చేశామని కమిట్ కావడం, దానికి ఇరాన్ ప్రతిస్పందించడం, ఫలితంగా పశ్చిమాసియా అస్థిరతకు గురికావడం ఇవన్నీ చర్చకు కేంద్ర బిందువు అయ్యాయి. ఇది అమెరికాలోని ఏడు స్వింగ్ స్టేట్‌ల్లో ఒకటైన మిచిగన్ వంటి స్వింగ్ స్టేట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. మిచిగన్ రాష్ట్రంలో పాలస్తీనియన్లతో పాటు లెబనీస్ అమెరికన్లు భారీ సంఖ్యలో ఉన్నారు. 2020లో బైడెన్ విజయానికి వీరే పరోక్షంగా దోహదం చేశారు.అయితే గత ఏడాది అక్టోబర్ 7 తరువాత నుంచి ఇజ్రాయెల్‌కు డెమొక్రాట్ల మద్దతు కొనసాగుతుండటం, ఇజ్రాయెల్ యుద్ధం ఆపేలా దౌత్యపరమైన చర్చలు జరపడంలో బైడెన్ విఫలం కావడంతో డెమొక్రాట్లపై పాలస్తీనియన్లు, లెబనీస్ అమెరికన్లు వ్యతిరేకత చూపిస్తున్నారు. మొన్న శనివారం ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కూడా వీరిపై ప్రభావం చూపిస్తున్నాయి. రెండో అంశం.. ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌పై దాడికి పాల్పడిన తరువాత చమురు ధరలు 910 శాతం పెరిగినప్పటికీ, యుద్ధం ఇంకా తీవ్రం కానున్నాయని హెచ్చరికలు వచ్చినప్పటికీ ప్రపంచ ఇంధనం మార్కెట్ తగిన విధంగా స్పందించలేదు. ఇంధనం మార్కెట్‌లో ఇరాన్ లేకపోవడం వల్ల వచ్చే నష్టాలను తట్టుకునే తగినంత శక్తిసామర్థ్యాలు అమెరికా, సౌదీ అరేబియాలకు ఉన్నాయన్నది కొత్తగా వెలుగులోకి వచ్చిన వాస్తవం.చైనా ఇరాన్ నుంచి 90 శాతం వరకు చమురును కొనుగోలు చేస్తుంది. అది చైనా అవసరాల్లో 15 శాతం వరకు సరిపోతుంది. మిగతా అవసరాల కోసం రష్యా, సౌదీ నుంచి దిగుమతి చేసుకుంటుంది. అయితే ప్రపంచ మార్కెట్‌లో ఇంధనం ధరలు ఏమాత్రం పెరిగినా, డొమెస్టిక్ గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతాయని అమెరికా ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. అమెరికా పోలింగ్‌కు ముందు ఇది పెద్ద సమస్య కానున్నది. పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ఆగేటట్టులేదు. మరి కొన్నాళ్లు సాగుతుందన్న భయం ప్రజల్లో వెంటాడుతోంది. శనివారం నాడు తాజాగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు సాగించినప్పటికీ, ఆ దాడుల వల్ల నష్టం తక్కువే జరిగిందని ఇరాన్ తేలికగా తీసుకుంది. తాము అనుకున్న లక్షాల మేరకు ఇంధనం / అణు క్షిపణి వ్యవస్థలపై కచ్చితంగా దాడులు చేశామని ఇజ్రాయెల్ ప్రకటించిన తరువాత అమెరికా ఒత్తిడిపై కొంతవరకు ఇజ్రాయెల్ వెనక్కు తగ్గింది.ఎలాగైతేనేం పశ్చిమాసియా సంఘర్షణలపై అమెరికా నియంత్రణ దాదాపు లేనట్టే. రష్యా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో కూడా అమెరికా పరిస్థితి ఇంతే. ఉదాహరణకు ట్రంప్ తాను గెలిస్తే ఈ రెండు యుద్ధాలను ఆపగలుగుతానని హామీ ఇస్తున్నారు. నిజానికి ఆయనకు అంత సామర్థం లేదు. రెండు యుద్ధాల మరో దశ మాత్రం అమెరికా అధ్యక్షునిగా ఎవరు పగ్గా లు చేపడతారో వారి పై ఆధారపడి ఉంది. మూడో అంశం.. ట్రంప్ ఎలాన్ మస్క్ సంబంధం. ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైతే రూ. 168 లక్షల కోట్లు ఆదా చేయవచ్చని టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రకటించారు. బైడెన్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఫెడరల్ బడ్జెట్‌లో దుబారా ఖర్చులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ట్రంప్ అధికారంలోకి వస్తే ఎలాన్ మస్క్‌ను కొత్త ప్రభుత్వ పార్లమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ విభాగానికి అధిపతిగా నియమించ ్నున్నట్టు కాంటర్ ఫిట్జ్ గెరాల్డ్ చైర్మన్ హెూవార్డ్ లుట్నిక్ ప్రకటించారు.అలాంటి ట్రంప్‌తో గట్టి సంబంధం ఉన్న ఎలాన్‌మస్క్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా అత్యంత సన్నిహిత సంబంధం ఉందని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెలువడడం సంచలనం కలిగిస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలాన్ మస్క్ కూడా ట్రంప్ గెలిస్తే రష్యాకే అండదండలు అందిస్తాడని, ఉక్రెయిన్‌కు చిక్కులు తప్పవని ఒక ఇంటర్వ్యూలో వెల్లడించడం ఈ సందర్భం గా ప్రస్తావించవలసి ఉంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం చివరకు ఎంతవరకు దారి తీసిందంటే దీనిపై నాసా చీఫ్‌ను దర్యాప్తు చేయాల్సిందిగా డిమాండ్ పెరిగింది. మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్‌తో అమెరికా ప్రభుత్వ మల్టీ బిలియన్ డాలర్ల కాంట్రాక్టుల సంబంధం ఉంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మస్క్ చేరువగా ఉంటున్నారన్న ఆరోపణలను రష్యా ఖండించింది. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేయడానికి రష్యా జోక్యం చేసుకుందన్నది బాగా ప్రచారమైంది. కమలా హారిస్‌కు మద్దతుగా సాగుతున్న ప్రచారంలో ఇది ప్రధాన అంశంగా మారనున్నది. ఎవరు తదుపరి అధ్యక్షునిగా విజయం సాధించినా పశ్చిమాసియా యుద్ధాలపై వారి దౌత్యరాజకీయ ప్రభావం ఉంటుందన్న అభిప్రాయం వినవస్తోంది.



# కరువు మండలాల గుర్తింపులో నిర్లక్ష్యం

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల భారీ వర్షాలే కురిశాయి. నదులు పొంగాయి.. వరదలు బీభత్సం సృష్టించాయి. కృష్ణమ్మ ఇప్పటికీ ఉత్సాహంగా ఉరకలెత్తుతోంది. అయినా పలుచోట్ల ఇంకా వర్షాభావం నెలకొంది. దీంతో పలు కరువు మండలాలను ప్రకటించక తప్పలేదు. ఖరీఫ్ పంట కాలంలో కీలకంగా భావించే జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొనగా ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. గత ఖరీఫ్‌లో 300 మండలాలకు పైన కరువు పరిస్థితులుండగా గత వైసిపి సర్కారు 103 మండలాలలనే గుర్తించింది. వైసిపి ప్రభుత్వం తక్కువ మండలాలను ప్రకటించిందని నాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి కూటమి విమర్శించింది. నేడు అధికారంలోకొచ్చాక గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించింది. దుర్భిక్షాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకునేందుకు ప్రకటించాల్సిన కరువు మండలాలను తగ్గించింది. రాయలసీమలోని ఐదు జిల్లాల్లో కేవలం 54 మండలాల్లోనే కరువును గుర్తించింది. వాటిలోనూ తీవ్ర స్థాయి, మధ్యస్థ స్థాయి అని రెండు కేటగిరీలుగా విభజించింది. కరువు మాన్యువల్ ప్రకారం మండలాలను గుర్తించామని సర్కారు చెబుతున్నా వాస్తవంలో అదేమీ కనిపించట్లేదన్న విమర్శలు ఉన్నాయి. సగటు గణాంకాల ప్రకారం సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాల సరాసరి కూడా అలాగే ఉంది. నెలల వారిగా, మండలాల వారీగా చూస్తేనే వాస్తవం బోధ పడుతుంది. జూన్‌లో జూన్‌లో 61 మండలాల్లో, జులై 210, ఆగస్టు 196, సెప్టెంబర్ 217 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షం కురిసింది. జులైలో 58, ఆగస్టు 35, సెప్టెంబర్ 68 మండలాల్లో అత్యల్ప (వర్షపులోటు 60 శాతం పైన) వర్షం నమోదైంది. కానీ ప్రభుత్వం ఈ అంశాలను పరిశీలనలోకి తీసుకోలేదు. జూన్-సెప్టెంబర్ వరకు మూడు మాసాల్లో మొత్తం కురిసిన వర్షపాతాన్ని గుర్తించింది. ఆ ప్రకారం జూన్ చివరికి 61, జూలై చివరికి 38, ఆగస్టు చివరికి 38, సెప్టెంబర్ చివరికి 54 మండలాల్లో తక్కువ వర్షం కురిసినట్లు పరిగణనలోకి తీసుకొని, ఆ మేరకే కరువు మండలాలను ప్రకటించినట్లు

# పేలిన ఉలిగడ్డ.. ఒకరి మృతి

లక్నో, దీపావళి పండగా సందర్భంగా కొన్నికొన్నిసార్లు కొందరి కుటుంబాల్లో విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. బాంబులను పేల్చే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉంటే వారి కుటుంబాల్లో తీరని విషయాన్ని మిగుల్చుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లాలో ఓ వ్యక్తి దీపావళి పటాకులు విక్రయించడానికి 'ఉల్లిగడ్డ' బాంబులతో మోటారు సైకిల్ పై వెళుతుండగా ఒక దేవాలయం వద్ద గుంతలో పడినప్పుడు ఆ ఉల్లిగడ్డ బాంబులు పేలిపోయాయి. దీంతో ఆ వ్యక్తి మరణించగా, మరో ఐదారుగురు గాయ పడ్డారు. ఈ ఉల్లిగడ్డ బాంబుల్లో ఐఈడీ వంటి పేలుడు పదార్థాలు వాడి ఉంటారని అనుమానాలు ఉన్నాయి. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 12.17 గంటలకు జరిగినట్లు సీసీటీవీ కెమెరా ఫుటేజ్ చూపుతోంది. గాయ పడిన ఆరుగురు వ్యక్తులు జిల్లా కేంద్ర దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాంబు పేలుళ్లతో ఆ ప్రాంతం అంతా పొగ కమ్మేసింది. పేలుడుతో పరిసర ప్రాంతాలు భయానకంగా మారాయి.స్కూటర్ మీద ఉల్లిగడ్డ బాంబులు తీసుకెళ్తున్న వ్యక్తిని సుధాకర్ అని గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తూకాకీ తూటాలకు ఇద్దరి బలి

న్యూఢిల్లీ, దీపావళి రోజున దేశ రాజధాని ఢిల్లీలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. షహదారా ప్రాంతంలో తుపాకీ తూటాలకు ఇద్దరు బలయ్యారు. మరో మైనర్ గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫార్స్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ కాల్పుల ఘటన చోటు చేసుకున్నది. మృతులు ఆకాశ్ (40), రిషబ్ (16) మృతి చెందగా.. క్రిష్ శర్మ (10) గాయపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. షహదారా ప్రశాంత్ గౌతమ్ మాట్లాడుతూ.. రాత్రి సమయంలో బిహారీ కాలనీలో కాల్పులు జరిగినట్లు పీసీఆర్ కాల్ వచ్చిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆకాశ్, అతడి మేనల్లుడు రిషబ్, కొడుకు కుమారుడు క్రిష్‌కు గాయాలయ్యాయన్నారు. తీవ్ర గాయాలతో ఆకాశ్, రిషబ్ చనిపోయారని చెప్పారు. ప్రాథమిక విచారణలో ఐదురౌండ్లు క్పాలు జరిగినట్లుగా తేలింది. గుర్తు తెలియని వ్యక్తి తుపాకీ కాల్పులు జరిపే ముందు పాదాలను తాకాడు. ఆ తర్వాత కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆకాశ్ శర్మ పక్కనే ఉన్న రిషబ్, క్రిష్‌కు సైతం తూట గాయాలయ్యాయి. వారిని ఆసుప్రతికి తరలించగా.. ఆకాశ్ శర్మ, రిషబ్ చనిపోయినట్లుగా వైద్యులు ప్రకటించారు. క్రిష్ శర్మ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, కాల్పులకు కారణాలు తెలియరాలేదు.

# భగ్గుమంటున్న విభేదాలు

విజయవాడ, ఏపీలోని ఆ జిల్లాకు ఇంచార్జ్ మినిస్టర్ అంటే వామ్మో అనాల్సిందే. ఎందుకంటే ఆ జిల్లాలోని ఏ నియోజకవర్గాన్ని కదిలించిన సమస్యలు తేనెతుట్టెల్లా కదులుతాయి. అసలే మూడు పార్టీలు జట్టు కట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఈ తరుణంలో ఇంచార్జ్ మినిస్టర్ బాధ్యత చాలా క్రూషియల్ గా ఉంటుంది. అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు మంత్రి అనగాని సత్యప్రసాద్. వైసీపీ నుంచి వచ్చిన నేతలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలుగు తమ్ముళ్లు మంత్రికి తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ఇంతకీ తిరుపతి జిల్లా కూటమిలో ఏం జరుగుతుంది.

**తిరుపతిలో భగ్గుమన్న విభేదాలు**

ఐదేళ్లపాటు చుక్కలు చూపించిన వైసీపీ నేతలు.. పార్టీలోకి రాగానే వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని తిరుపతి జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ అనగాని సత్యప్రసాద్ ముందు వాపోయారు తెలుగు తమ్ముళ్లు. తమ నాయకులే తమను పట్టించుకోవడం లేదని అసంతృప్తిని వెల్లగక్కుతున్నారు. తిరుపతి జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ పదవి అనేది కత్తి మీద సాములాంటిది. అలాంటి చోట ఇంచార్జ్ మంత్రిగా వచ్చిన అనగాని సత్యప్రసాద్ కు మొదటి రివ్యూలోనే షాకుల మీద షాకులు తగిలాయట. టీడీపీ కేడర్, జనసైనికులు తమ అసంతృప్తిని మంత్రి ఎదుట ప్రస్తావించారట. తమ సమస్యలకు వెంటనే ఓ పరిష్కారం చూపాలని కోరారు. వైసీపీ నుంచి టీడీపీలో వచ్చిన నేతలు మాత్రం MLAలకు మద్దతుగా మాట్లాడటం తెలుగు తమ్ముళ్ల ఆగ్రహానికి మరింత కారణమైంది.

**ఏడు నియోజకవర్గాలపై మంత్రి రివ్యూ**

ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలపై సమీక్ష నిర్వహించారు. అయితే అందులో సత్యవేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట నియోజకవర్గాల చర్చలు హాట్ హాట్ గా జరిగాయంట. తిరుపతి నియోజకవర్గంలో అయితే వైసీపీ నేతల పెత్తనం పెరిగిపోయిందని మంత్రి ఎదుటే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారంట. MLA ఆరణీ శ్రీనివాసులతో పాటు మరోకరు షాడో MLAగా ఉన్నారని హాట్ కామెంట్స్ చేసినట్టు టాక్.మరోవైపు చిత్తూరు నుంచి వచ్చిన నేతలు సైతం పెత్తనం చేస్తున్నారన్ని ఫిర్యాదు చేసారట. అదేటైంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య వ్యవహార శైలిపై కూడా మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తెలుగు తమ్ముళ్లను కనీసం పట్టించుకోవడం లేదని మంత్రి ఎదుట వాపోయారట. కమిషనర్ ఒంటెద్దు పోకడలతో పోతున్నారని.. పార్టీ, ప్రభుత్వం గురించి పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని కంప్లైంట్ చేసినట్టు తెలుస్తోంది. అంతేకాదు ఆమె ఓ టీమ్ ను ఏర్పాటు చేసుకుందని వారితోనే పనులు చేస్తుందని, అందులో వైసీపీ నేతలు కూడా ఉన్నారని మంత్రికి డీటెయిల్డ్ రిపోర్టు ఇచ్చినట్టు సమాచారం. అంతేకాదు వైసీపీ నేతలతో కలిసి కొందరు నాయకులు మద్యం సిండికేట్ దందాలు చేస్తున్నారని తెలియడంతో సమావేశం కాస్త రసాభాసగా మారిందట.

**తమవాళ్లే పట్టించుకోవడం లేదని అసంతృప్తి**

ఇక సత్యవేడు MLA కోనేటి ఆదిమూలం ఎపిసోడ్ పైనా జోరుగానే చర్చ జరిగిందట. %మీూూ%తో పాటు వైసీపీ నుంచి వచ్చిన అతని అనుచరులు సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేయగా.. పాత టీడీపీ కేడర్ మాత్రం తీవ్రంగా వ్యతిరేకించినట్టు సమాచారం. దాంతో ఇరువర్గాల మధ్య మంత్రి ఎదుటే వాదోపవాదనలు జరిగాయట. అయితే మంత్రి అనగాని జోక్యం చేసుకుని %మీూూ% ఇష్యూ గురించి మాట్లాడవద్దని ఏమైనా పనులు కావాలంటే తనను సంప్రదించాలని సూచించినట్టు టాక్. భవిష్యత్ లో సత్యవేడు నియోజకవర్గానికి స్ంబంధించి త్రీ మ్యాన్ కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారట. ఓవరాల్ గా ఆదిమూలానికి టీడీపీలో డోర్స్ క్లోజ్ అయ్యాయని మంత్రి అనగాని చెప్పకనే చెప్పారట. ఇదే విషయంలో కేడర్ కూడా తీవ్రంగా చర్చించుకోవడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.

**తిరుపతిలో వైసీపీ నేతల పెత్తనం**

సూళ్లూరుపేట నియోజకవర్గంపైనా చర్చలు త్వరగా ముగిశాయట. MLA విజయశ్రీ కంటే వారి కుటుంబసభ్యుల పెత్తనం ఎక్కువైందని నేతలు.. మంత్రి అనగాని దృష్టికి తీసుకెళ్లారట. టీడీపీ కోసం మొదటి నుంచి కష్టపడిన వారిని కాదని.. వైసీపీ నుంచి వచ్చిన వారికే ప్రయారటీ ఇస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం.

# కేటీఆర్ పాదయాత్ర.. ప్లాన్ వర్కవుట్ అవుతుందా ?



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. ఓ వైపు నేతలు, మరోవైపు కేడర్ వెళ్లిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడింది కారు పార్టీ. కొత్త కొత్త అస్త్రాలను తెరపైకి తెస్తోంది. లేటెస్ట్‌గా రాష్ట్రమంతా పాదయాత్రకు సిద్ధమవుతున్నారు కేటీఆర్.రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత చాలా ఇబ్బందులు పడుతోంది కారు పార్టీ. అధికార పార్టీ నుంచి వస్తున్న మాటల యద్దాన్ని ఎదుర్కోలేక పోతోంది. ఈ క్రమంలో నానా ఇబ్బందులు పడుతున్నారు ఆ పార్టీ నేతలు. ఈ విషయంలో హైకమాండ్ దిక్కుతోచని పరిస్థితిలో పడింది.ఇటీవల బీఆర్ఎస్ ఏ అంశం ఎత్తుకున్నా బూమరాంగ్ అవుతోంది. కీలక నేతలపై ప్రభుత్వం నుంచి కౌంటర్ ఎటాక్ మొదలవుతోంది. వీటిని ధీటుగా ఎదుర్కోలేక నేతలు చెదిరిపోతున్నారు. కేడర్ కకావికలం అవుతోంది. దీన్ని నుంచి బయటపడాలంటే ఒక్కటే మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. నేరుగా ప్రజల్లోకి వెళ్లడమే ఉత్తమని భావించింది ఆ పార్టీ.తన మనసులోని మాటను బయటపెట్టారు కేటీఆర్. త్వరలో రాష్ట్రమంతా పాదయాత్ర చేస్తానని ఓపెన్‌గా చెప్పేశారు. పాదయాత్ర ఎప్పటి నుంచి మొదలుపెడతారు అనేది ప్రస్తుతానికి క్వశ్చన్ మార్క్.అధికారంలోకి రావడానికి నేతలు ఎంచుకునే ఏకైక మార్గం పాదయాత్ర. గతంలో చాలామంది నేతలు ఆ అస్త్రాన్ని ప్రయోగించారు.. సక్సెస్ అయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్, చంద్రబాబు, జగన్, నారా లోకేష్, మల్లు భట్టివిక్రమార్క ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది నేతలే వస్తారు. పాదయాత్ర తర్వాత ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చాయి కూడా.ఇటీవల మీడియా చిట్ చాట్‌లో పాదయాత్ర చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో బీఆర్ఎస్ కీలక నేతలు ఆలోచనలో పడ్డారు.ఇప్పుడున్న పరిస్థితి నుంచి గటెక్కాలంటే పాదయాత్ర చేయడమే ఉత్తమమని కేసీఆర్ సలహా ఇచ్చినట్టు తెలుస్తోంది. దాని ప్రకారమే ఈ విషయాన్ని కేటీఆర్ బయటపెట్టారట. ప్రజల తరపున పోరాటం చేయడమే తమ బాధ్యతని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నది ఆయన మాట. పాదయాత్ర అనగానే ప్రజలు హామీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన కారు పార్టీ ఎలాంటి హామీలు ఇస్తుందో చూడాలి.

# జార్ఖండ్‌లో పొత్తులే కీలకం..కాంగ్రెస్ కూటమితో పటిష్టంగా జెఎంఎం



రాంచీ,ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న జార్ఖండ్‌లో ఇప్పుడు పాలక జెఎంఎం సహకారం లేకుండా ఏమీ చేయలేని స్థితిలోకి కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. సర్ఫరాజ్ అహ్మద్, సుబోధ్ కాంత్ సహాయ్, ఫుర్కాన్ అన్సారీ, రాజేందర్ సింగ్, చంద్రశేఖర్ దూబే వంటి నాయకులతో కలకలలాడిన కాంగ్రెస్ ఇప్పుడు బలం తగ్గిఉంది. పొత్తులు ఫలించడం, సంక్షేమ పథకాలు సానుకూలించడంతోపాటు సోరెన్ అరెస్టుతో రాష్ట్రంలో వ్యక్తమైన సానుభూతి పాలక 'జెఎంఎం', 'ఇండియా' కూటమికి కలసి వస్తోందని భావిస్తున్నారు. బిజెపికి బయపడి, పార్టీ మార్పిళ్ల నుంచి కాపాడుకోవడానికి సిఎం తమ ఎంఎల్ఎలను రెండు మార్లు ఛత్తీస్‌గఢ్‌లో క్యాంపుల్లో పెట్టాల్సి వచ్చింది. ఇకపోతే 2019లో చేజారిన జార్ఖండ్‌ను తిరిగి పొందడానికి బిజెపి ఆదివాసీల మనసు గెలిచే సకల యత్నాలూ చేస్తోంది. జెఎంఎం బలంపై గట్టిగా దెబ్బకొట్టాలనే పట్టుదలతో పని చేస్తోంది. చేసిన తప్పును సరిదిద్దుకుంటున్న భావన జార్ఖండ్ ప్రజల్లోకి వెళ్లేలా, బిజెపి గెలిస్తేఃఉ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి సాగుతుందని ప్రచారంలో చెబుతున్నారు. ఆదివాసీయేతర నాయకుడు రఘుబర్దాస్‌ని ముఖ్యమంత్రి చేసి ఆదివాసీల కోపానికి కారణమైనట్టు పార్టీ నాయకత్వం గ్రహించింది. అలాగే హేమంత్ సోరెన్ పై కేంద్ర దర్యాప్తు సంస్థల కేసు, అరెస్టుతో అది మరింతగా బలపడి, బిజెపి ఆదివాసీలకు వ్యతిరేకం అన్న భావన కలిగింది. అయితే ముర్మను రాష్ట్రపతిని చేయడం కొంత కలసి వస్తోంది. జార్ఖండ్‌లో ఏ కూటమినైనా.. అంతిమంగా పొత్తులే గట్టెక్కించాలి. ఏ ఒక్కరూ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగల ప్రజామద్దతు కూడగట్టే స్థితిలో లేరు. పొత్తుల్లో గెలిచి ప్రభుత్వాలు ఏర్పరచడం, విడిగా పోటీ చేసినపుడు ఓడి విపక్షంలో కూర్చోవడం.. ఈ అనుభవం ఇటు బిజెపి, అటు జెఎంఎం ఇద్దరికీ ఉంది. అందుకే పొత్తుల్ని ఖరారు చేసుకొని కూటమిగానే బరిలో దిగుతున్నారు. 81 స్థానాలున్న రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ నంబర్ 41. పార్టీల మధ్య పొత్తుతో పాటు సామాజిక సమీకరణాలపైన దృష్టిపెట్టి, గెలుపే లక్ష్యం చేసుకుంటున్నారు. 2014లో విడిగా పోటీచేసి 25స్థానాలు గెలిచిన జెఎంఎం, కాంగ్రెస్‌లు 2019 ఎన్నికల్లో కలిసి పోటీచేసి 47 స్థానాలు గెలిచి, ప్రభుత్వం ఏర్పరిచారు. 2014లో ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు)తో పొత్తు పెట్టుకొని 42 సీట్లు నెగ్గిన బిజెపి, 2019లో పొత్తులు బెడిసి 25 సీట్లకు పరిమితమైంది. ప్రభుత్వం పోయింది. 16శాతం జనాభాగా ఉన్న కుర్మీ మహతోల్లో పట్టున్న ఎజెఎస్‌యు కనీసం 14 అసెంబ్లీ సీట్లలో ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 7 జిల్లాలు, 20 సీట్లలో ప్రభావం గల ముస్లింలు సుమారు 15 శాతంగా ఉన్నారు. ఒబిసి జనాభా 46శాతం ఉంది. అందుకే, బిజెపి(68), ఎజెఎస్‌యు(10), జెడి(యు)(2), ఎల్‌జెపి(1) కలిసి పోటీ చేయాలని సయోధ్యతో ఉన్నాయి. 'ఇండియా' కూటమిలోనూ సీట్ల పంపకాలు జరిగినా.. మూడు స్థానాల్లో మిత్రపక్షాల అభ్యర్థులే పరస్పరం పోటీలో ఉండే పరిస్థితి తలెత్తింది. జెఎంఎం (43), కాంగ్రెస్ (30), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)(5), సిపిఐ-ఎంఎల్ (3) పార్టీలు కలిసి మొత్తం 81 స్థానాల్లో పోటీ చేయాలనుకున్నారు. కానీ, కాంగ్రెస్‌కు కేటాయించిన రెండు సీట్లలో ఆర్‌జెడి, సిపిఐ-ఎంఎల్‌కు కేటాయించిన ఒక చోట కాంగ్రెస్.. పొత్తులకు విరుద్ధంగా పోటీలో దిగుతున్నాయి. ఇన్ని సంక్లిష్టతల మధ్య జార్ఖండ్ గెలుపు ఎవరిని వరించనున్నదో నవంబరు 23 న తేలనుంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో 14లో 9 సీట్లు ఎన్‌డియే కూటమి గెలిచినప్పటికీ, 5 ఎస్‌టి రిజర్వుడు సీట్లలోనూ ఓడిపోయింది. అందుకే, ఈసారి గెలిస్తే ఆదివాసీయే ముఖ్యమంత్రి అనే సంకేతాలు ఇవ్వడానికి బిజెపి నాయకత్వం యత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినా.. కొందరు ఆదివాసీ ముఖ్యనేతలను అసెంబ్లీ బరిలోకి దింపుతోంది. గీతాకోడ , సీతాసోరెన్ , అర్జున్ ముండా, చాంపయ్ సోరెన్ , జెఎంఎం మాజీ ఎంఎల్ఎ లోబిన్ ఎంబ్రామ్ వంటి వారు రంగంలో ఉన్నారు. ఆదివాసీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో 10, 12 అసెంబ్లీ సీట్లయినా గెలవాలనేది బిజెపి పట్టుదలగా కనిపిస్తోంది. పార్టీలోకి సరయురాయ్ తిరిగి రావడం కలిసొచ్చే అంశమని నాయకత్వం భావిస్తోంది. ఇదే అదనుగా కాంగ్రెస్ కూడా ఎదురుదాడి ప్రచారం చేస్తోంది. బిజెపి గిరిజన, ఆదివాసీ వ్యతిరేకి అనీ ప్రచారం చేస్తోంది. సిఎం హేమంత్ సోరెన్ అరెస్టయి జైల్లో ఉన్న సమయంలో ఆయన సతీమణి కల్పనా సోరెన్ విస్తృతంగా జనంలో తిరిగి కేంద్రానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. బొగ్గు రాయల్టీలు ఇవ్వకుండా, రాష్ట్రంపై వివక్ష చూపుతూ కేంద్రం సహకరించక పోవడమేకాక, ఆర్థికంగా జార్ఖండ్‌ను దెబ్బకొట్టే కుట్రలు చేస్తోందనీ చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. మయ్యా సమ్మాన్ యోజనతో పాటు రూ. 3584 కోట్ల మేర విద్యుత్ బిల్లుల మాఫీ, రూ.400 కోట్ల మేర రైతు వ్యవసాయ రుణ మాఫీ, డిసెంబర్ నుంచి స్టయిఫెండ్‌ను రూ.2500కి పెంచుతామన్న హామితో ప్రజల్లో సానుకూలత పెరిగిందని భావిస్తున్నారు. కాంగ్రెస్, జెఎంఎం నుంచి ఎన్నికల ముందు బిజెపిలోకి వెళ్లిన పలువురు నేతలు తిరిగి రావడాన్ని ఓ సానుకూలాంశంగా 'ఇండియా' వర్గాలు భావిస్తున్నాయి.

# టీటీడీ కొత్త ఛైర్మన్‌పై నాగబాబు షాకింగ్ కామెంట్స్..!



అమరావతి,జనసేన నేత నాగబాబు టీటీడీ కొత్త ఛైర్మన్ నియామకంపై సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ షాకింగ్ కామెంట్లు చేశారు. హిందూ ధర్మాన్ని, శ్రీనివాసుడిని అమితంగా కొలిచే బీఆర్ నాయుడుకు టీటీడీ ఛైర్మన్ పదవి దక్కడం శుభసూచికమని అభిప్రాయపడ్డారు. సరైన వ్యక్తికి సరైన సమయంలో సరైన గౌరవం లభించినందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఇది వరకు ఉన్న అవకతవకలు అన్నీ సరిచేసి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠతను మరింత మెరుగుపరచాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా జనసేన తరపున టీటీడీ సభ్యులుగా ఎన్నికైన బురగపు ఆనంద సాయి, అనుగోలు రంగశ్రీ, మహేందర్ రెడ్డి మరియు ఎన్నికైన ఇతర సభ్యులు అందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు.ఇదిలా ఉంటే ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత టీటీడీ ఛైర్మన్ పదవి నాగబాబుకే అని ప్రచారం జరిగింది. ఈ మేరకు సోషల్ మీడియాలో మీమ్స్, పోస్టులు తెగ వైరల్ అయ్యాయి. మీడియాలో సైతం నాగబాబుకు ఛైర్మన్ పదవి దక్కబోతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. జనసేన గెలుపులో నాగబాబు కీలకంగా వ్యవహరించారు. తమ్ముడు పవన్ కల్యాణ్ పోటీ చేసిన పిఠాపురం స్థానంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ నాగబాబు పర్యటించి పార్టీకి సేవలు అందించారు. ఈ నేపథ్యంలోనే నాగబాబుకు నామినేటెడ్ పోస్టు దక్కుతుందని ప్రచారం జరగడంతో అంతా ఆ వార్తలు నిజమేనని భావించారు. కానీ నాగబాబు మాత్రం ఆ వార్తలను ఖండించారు. తాను గానీ, పార్టీ అఫీషియల్ హ్యాండిల్స్ గానీ పోస్ట్ చేసిన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని స్పష్టం చేశారు.తనకు టీటీడీ ఛైర్మన్ పదవి వరించింది అనే వార్తలలో నిజం లేదని తెలిపారు. దయచేసి తప్పుడు వార్తలను నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని కోరారు. అలా నాగబాబు క్లారిటీ ఇవ్వడంతో ఆ వార్తలకు చెక్ పడింది. ఇక నాగబాబు తాజా పోస్టులోనూ కీలక వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వంలో టీటీడీలో అక్రమాలు బయటపడిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా లడ్డూ వ్యవహారం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వాడారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కొత్త ఛైర్మన్ నియామకంలో కూటమి సర్కార్ చాలా జాగ్రత్త వహించింది. ఛైర్మన్ పదవికి పలువురి పేర్లు తెరపైకి రాగా చివరికి బీఆర్ నాయుడును ఆ పదవి వరించింది. మరి ఆయన హయాంలో టీటీడీ అభివృద్ధి ఎలా ఉంటుందో చూడాలి.

# బీజేపీపై నవాబ్ మాలిక్ షాకింగ్ కామెంట్స్



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అజిత్ పవార్ ఎన్‌సీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న నవాబ్ మాలిక్ కు ప్రచారం చేయరాదని ఆ పార్టీ భాగస్వామిగా ఉన్న బీజేపీ నిర్ణయం తీసుకోవడంపై ఆయన షాకింగ్ కామెంట్స్ చేశారు. దావూద్ ఇబ్రహీంతో సంబంధాలున్నాయనే ఆరోపణల ఎదుర్కొంటున్న మాలిక్ తరపున ప్రచారం చేయమంటూ బీజేపీ నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఇటీవల తెలిపారు. దీనిపై ఓ ఇంటర్వ్యూలో మాలిక్ స్పందిస్తూ, ముస్లిం మతానికి చెందిన వ్యక్తిని కావడం వల్ల తనపై ఉగ్రవాదం ఆరోపణలు చేయడం చాలా తేలికని అన్నారు.''ఉగ్రవాదులతో, అజ్ఞాత నేరప్రపంచంతో సంబంధాలున్నాయని నాపై చేస్తున్న ఆరోపణలన్నీ నిరాధారం. ముస్లిం నేతను కావడం వల్లే తేల్లిగా టెర్రరిస్టు ముద్ర వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా తనను అడ్డుకునేందుకు కొందరు ఇలాంటి నిరాధార ఆరోపణలు చేశారు. అయితే నేను మనీ లాండరింగ్ నిందితుడనే కానీ టెర్రరిజం నిందితుడను కాదు" అని నవాబ్ మాలిక్ వివరణ ఇచ్చారు.

అజిత్ పవార్ రుణం తీర్చుకోలేను

బహిరంగంగా తనకు మద్దతు తెలిపిన పార్టీ అధ్యక్షుడు అజిత్ పవార్‌కు నవాబ్ మాలిక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆయన రుణం తీర్చుకోలేనని అన్నారు. జైలు భయంతో తాను అజిత్ పవార్‌తో కలవలేదని, జైలుకు వెళ్లేందుకు తాను ఎప్పుడూ భయపడలేదని చెప్పారు. ముఖం ముందు ఒకమాట, ముఖం వెనక ఒక మాట చెప్పే అలవాటు తనకులేదని, ప్రజలకు ఏదైతే చెప్పామో దానికి కట్టుబడి ఉంటామన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని అనుకుంటున్నట్టు చెప్పారు. తనపై ఎవరిని అభ్యర్థిగా నిలబెడతారని అనుకున్నానో వారినే నిలబెట్టారని, ప్రతి ఎన్నికల్లోనూ పార్టీలోనే వ్యతిరేకతలు ఉంటాయని, అవి ఇప్పుడూ ఉన్నాయన్నారు. ఎలాంటి వ్యతిరేకత ఉన్నా ఈ ఎన్నికల్లో తాము గెలుస్తామని, ప్రజలు తనను గెలిస్తారని నవాబ్ మాలిక్ ధీమా వ్యక్తం చేశారు.

# ఆధ్యాత్మికోత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధం



ఖమ్మం,కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభమవుతోంది. శివునికి అత్యంత ప్రీతి పాత్రమైన కార్తీకమాసంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు శైవక్షేత్రాలు సిద్ధమవుతున్నాయి. కార్తీకమాసం సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగును. ఈ నెల 4,11,18,25 తేదీల్లో కార్తీక సోమవారాలు పూజలు, ఉపవాస దీక్షను భక్తులు పాటిస్తారు. అలాగే ఈ నెల 12న, 26న కార్తీక ఏకాదశి రోజుల్లో శివాలయాలతోపాటు వైష్ణవ ఆలయాలను భక్తులు దర్శించుకుంటారు. ఉసిరి చెట్టు నీడలో భోజనాలు పుణ్యమని భావించి ఉసిరి చెట్టు ఉన్న తోటల్లో కార్తీక వన భోజనాలు నిర్వహిస్తారు.

కార్తీకమాసంలో చేయాల్సిన ప్రత్యేక పూజలు

కార్తీకమాసానికి సమానమైన మాసం, వేదాలకు సమానమైన శాస్త్రం, గంగ కంటే పుణ్యమైన తీర్థాలు లేవని పురాణ గాథలు చెబుతున్నాయి. కార్తీక మాసం అత్యంత పవిత్రమైనది మహిమాన్వితమైనది శివకేశవులకు ఎంతో ప్రీతికరమైన మాసం. ఈ నెలలో శివాలయాల్లో రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చనలు, రుద్ర పూజలు నిర్వహిస్తారు. శివుడు అభిషేక ప్రియుడు అని అలంకారాలు, రాజోపచార నైవేద్యాలతో పనిలేకుండా మనసులో శివుని ధ్యానిస్తూ అభిషేకం చేస్తే ప్రీతి చెందుతాడని, శివాభిషేకం సకల దోషాలు నివారించి శుభాలను కలుగజేస్తోంది. శివాలయంలో అష్టోత్తర లింగార్చన, మహా లింగార్చన, సహస్ర లింగార్చన ఉత్తమమైనవి. ఈ మాసంలో శివునికి అర్చనలు చేస్తే సంవత్సర మొత్తం చేసిన ఫలితాలు లభిస్తాయి. తులసీ దళాలతో మహావిష్ణుని కార్తీకమాసంలో పూజిస్తే ముక్తిదాయకం అని శాస్త్ర చెబుతున్నాయి. ఈ మాసంలో మహా విష్ణువు దామోదర నామంతో పిలవబడతాడు. తులసి పూజ చేయడం పుణ్యప్రదం. సత్యనారాయణ వ్రతం విష్ణు సహస్రనామ పారాయణ చేయడం శ్రేష్ఠం. మహా శివుడు, మహా విష్ణువు అనుగ్రహానికి ఈ మాసం చాలా శ్రేష్టమైనది. కార్తీక మాసం ప్రారంభం నుండే ఆకాశదీపం ప్రారంభమవుతుంది. ఈ మాసంలోనే వైకుంఠ చతుర్దశి. దాత్రి నారాయణ పూజ, కార్తీక పౌర్ణమి, వైకుంఠ చతుర్దశి చిలుకు ద్వాదశి, తులసి కల్యాణం విశేష మైనవి.

ఖమ్మం జిల్లాలో శివాలయాల్లో ఆధ్యాత్మిక శోభ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని శివాలయాలు, వైష్ణవాలయాలు కూడా కార్తీక ఆధ్యాత్మిక శోభకు సిద్ధమవుతున్నాయి. జిల్లాలోని గోదావరి, మున్నేరు నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి, కార్తీక దీపాలు విడిచిపెడుతుంటారు. ఆ నదీ రేవుల వద్దకు తెల్లవారు జామున భక్తులు చేరుకుని కార్తీకదీపాలు విడిచిపెడుతుంటారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శివాలయాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శైవక్షేత్రాలు సర్వం సిద్ధమవుతున్నాయి. పెనుబల్లి మండలంలో నీలాద్రి శైవ క్షేత్రం, భద్రాచలంలో ప్రసిద్ధ సీతారామాలయం, ఖమ్మం మండలంలో తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయం , కూసుమంచిలో స్వయంభూ శివాలయం, ఖమ్మం సిటీలో గుంటు మల్లేశ్వర స్వామి స్వయంభు శైవ క్షేత్రం, అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయం, సంబద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మధిరలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం, పాల్వంచలో పెద్దమ్మ తల్లి ఆలయం కార్తీకమాస పూజలకు సిద్ధమవుతున్నాయి.

వరంగల్ నగరంలో

ఉమ్మడి వరంగల్ జిల్లా శైవ క్షేత్రాలకు ప్రసిద్ధ వరంగల్ నగరంలో గట్టుపల్లి పండుగల రామలింగేశ్వర స్వామి దేవాలయం, మెట్టుగుట్ట రామలింగేశ్వర ఆలయం, సిద్దేశ్వరాలయం, జలేశ్వరాలయం, వేయి స్తంభాల రుద్రేశ్వరాలయం, కోటిలింగాల, కాశీబుగ్గ రామలింగేశ్వర ఆలయం దేవాలయం, అయినవోలు మల్లికార్జున స్వామి దేవాలయం, కొరవి వీరభద్ర స్వామి దేవాలయం, కొత్తకొండ మల్లికార్జున స్వామి, కాలేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం, రామప్ప దేవాలయం ముస్తాబయ్యాయి. వేయి స్తంభాల దేవాలయంలో కోటి దినోత్సవం నిర్వహిస్తారు. అన్ని శైవక్షేత్రాల్లో ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు చేస్తారు.

## 40శాతం డైట్ కాస్మోటిక్ ఛార్జీల పెంపు

హైదరాబాద్,తెలంగాణలో గురుకులాలకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెరిగాయి. 40శాతం మేర పెంచినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఎన్నడు లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ 40శాతం పెంచారని గుర్తుచేశారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40శాతం చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పెంచిన చార్జీలు అందుకుబోతున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విద్యార్థులకు అసలైన దీపావళి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు.ఇక హాస్టల్ విద్యార్థులు అర్థాకలితో అవస్థలు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లది, హాస్టల్ సిబ్బందిది అని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.డైట్ చార్జీలు ఏడేళ్లుగా, కాస్మోటిక్ చార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని మంత్రి సీతక్క మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో విద్యా వ్యవస్థ నాశనమైందని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క విమర్శలు చేశారు. విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు. ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగాయని.. అందుకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో

# వైఎస్ కుటుంబ వివాదం.. కేవీపీ మౌనం..



అమరావతి,ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న ఆస్తి వివాదం హాట్ టాపిక్ గా ఉంది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డిల మధ్య ఆస్తుల పంపకం విషయంలో తలెత్తిన నిస్సందేహంగా వైఎస్ కుటుంబ పరువును బజారున పడేంది. ప్రజాజీవితంలో ఉన్నవారికి వ్యక్తిగతం అనేది ఉండదని అంటారు. జగన్,షర్మిల విషయంలో అదే జరుగుతోంది. ఆస్తుల విభేదాలు ఎలా ఉన్నా వైఎస్ కుటుంబం లోని లొసుగులన్నీ పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో బయటపడి వైఎస్ కుటుంబం నవ్వుల పాలౌతోంది. జగన్, షర్మిల మధ్య అన్నా చెల్లెళ్ల అనుబంధం, రక్త సంబంధం కంటే ఆస్తి గొడవలే పెద్ద పీట వేసుకు కూర్చున్నాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో ప్రజా సానుభూతి షర్మిల వైపే ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తాను గద్దెనెక్కడం కోసం చెల్లెలు కాళ్లరిగేలా చేసిన పాదయాత్ర, తాను జైలులో ఉన్నప్పుడు పార్టీని భుజాన వేసుకుని నడిపించిన వైనం గుర్తు చేసుకుంటూ పబ్బం గడిచిన తరువాత జగన్ షర్మిలను పార్టీ నుంచి పంపేశారనీ, తల్లిని సైతం అమర్యాదగా పార్టీ అధ్యక్ష పదవి నుంచి రాజీనామా చేయించి పంపేరనీ ప్రజలు చర్చించుకుంటున్నారు. జగన్ షర్మిల మధ్య ఆస్తుల తగాదాలో జగన్ రాజకీయం కూడా ప్రస్తావనకు, చర్చకు వస్తున్నది. అది పక్కన పెడితే తన తరఫు వాదనను షర్మిల మాత్రమే వినిపిస్తుండగా జగన్ తరఫున వకాల్తా పుచ్చుకుని వైసీపీ నేతలు షర్మిలపై విరుచుకుపడుతున్నారు. ఈ వివాదంలో వైఎస్ కుటుంబ బంధువు వైవీ సుబ్బారెడ్డి, వారి కుటుంబానికి సన్నిహితుడు విజయసాయి రెడ్డిలు మీడియా ముందుకు వచ్చి షర్మిల అవాస్తవాలు చెబుతున్నదంటూ వ్యాఖ్యలు చేశారు. ఇంకో అడుగు ముందుకు ముందుకు వేసి చంద్రబాబుకు అనుకూలంగా షర్మిల మాట్లాడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. అయితే ఈ తరుణంలో వైఎస్ విజయమ్మ రంగ ప్రవేశం చేసి షర్మిలకు మద్దతుగా బహిరంగ లేఖ రాయడంతో వైసీపీ నేతల విమర్శలను పట్టించుకునే నాథుడే లేకపోయాడు. అయినా షర్మిలకు జగన్ అన్యాయం చేశారనే మెజారిటీ ప్రజలు నమ్ముతున్నారు. అయితే వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, వైఎస్ ఆత్మగా అందరూ భావించే కేవీపీ రామచంద్రరావు షర్మిల, జగన్ ఆస్తుల వివాదం విషయంలో నోరు మెదపకపోవడం గమనార్హం. వైఎస్ బతికి ఉండగా ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయానికీ ప్రత్యక్ష సాక్షి కేవీపీ రామచంద్రరావు. వైఎస్ షర్మిలకు కుటుంబ ఆస్తులలో సమాన వాటా ఇవ్వాలని భావించారా లేదా అన్న విషయాన్ని సాధికారికంగా చెప్పగలిగిన వ్యక్తి కేవీపీ మాత్రమే. జగన్ కాంగ్రెస్ తో విభేదించి వైసీపీ పార్టీని పెట్టుకున్నా కేవీపీ మాత్రం కాంగ్రెస్ లోనే కొనసాగుతున్నారు. అయినా జగన్ శ్రేయోభిలాషిననే ఆయన చెప్పుకుంటు న్నారు. జగన్ ఐదేళ్ల పాలనపై ఆయన గట్టిగా విమర్శించిన దాఖలాలు కూడా లేవు. ఇప్పుడు షర్మిల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ, కేవీపీ ఆమో పక్కన పెద్దగా కనిపించిందీ లేదు. మద్దతు పలికిందీ లేదు. అందుకే షర్మిల, జగన్ ఆస్తుల వివాదంలో కేవీపీ ఏం మాట్లాడినా ఇంపార్షియల్ గా ఉంటుందని జనం భావిస్తారు. ఆయన కనుక నోరు తెరిచి షర్మిలకు సమాన వాటా ఇవ్వాలని వైఎస్ భావించారన్న మాట చెబితే ఇక జగన్ రాజకీయ భవిష్యత్ కు ఎండ కార్డ్ పడినట్లునని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com